


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 24-05-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 343 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### కర్ణాటక 24వ సీఎంగా

# కుమారస్వామి ప్రమాణం

- కొలువుదీరిన జేడీఎస్-కాంగ్రెస్ నేతలు
- విధాన సౌధ మెట్ల వద్ద ప్రమాణం
- డిప్యూటీ సీఎంగా పరమేశ్వర
- బలనిరూపణ అనంతరం ఇతర మంత్రుల ప్రమాణం
- కాంగ్రెస్-22, జేడీఎస్-12 మంత్రి పదవులు
- పదవుల పంపకంలో అసంతృప్తి



బెంగళూరు : కర్ణాటకలో జేడీఎస్-కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర 24వ ముఖ్యమంత్రిగా జేడీఎస్ అధినేత కుమారస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. విధాన సౌధ తూర్పుద్వారం మెట్ల వద్ద ఏర్పాటు చేసిన భారీ వేదికపై ఆయనతో గవర్నర్ వాజుభాయ్ వాలా ప్రమాణం చేయించారు.

అనంతరం ఉప ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ నేత పరమేశ్వర ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో కాంగ్రెస్, జేడీఎస్ నేతలు, ప్రజలు హాజరయ్యారు. కుమారస్వామి ప్రభుత్వం బలనిరూపణ చేసుకున్న అనంతరం మిగతా మంత్రులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఒప్పందంలో భాగంగా కాంగ్రెస్‌కు 22 మంత్రి పదవులు.. జేడీఎస్‌కు 12 మంత్రి పదవులు దక్కనున్నాయి. స్పీకర్ పదవిని కాంగ్రెస్‌కు కేటాయించగా.. డిప్యూటీ స్పీకర్ పదవిని జేడీఎస్‌కు ఇచ్చారు.



ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మూడువేల మందికిపైగా వీఐపీలు ప్రత్యేక అతిథులుగా విచ్చేశారు. దేశవ్యాప్తంగా పలు పార్టీలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. జేడీఎస్ జాతీయాధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, పశ్చిమ్ బంగ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వి యాదవ్, బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి, సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారం ఏచూరి తదితరులు హాజరయ్యారు.

కుమారస్వామి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. 2006లో తొలిసారిగా ఆయన ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అయితే అప్పుడు కూడా సంకీర్ణ ప్రభుత్వమే ఏర్పాటవడం గమనార్హం. 2006లో భాజపాతో పొత్తు పెట్టుకుని సీఎం అయ్యారు. అయితే కేవలం 20 నెలలు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్నారు.

అధికార బదిలీకి ఆ పార్టీతో కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించటంతో 2007 నవంబరు 2న భాజపా మద్దతు కోల్పోయారు.

దీంతో ఆయన సీఎం పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

## ప్రాంతీయ పార్టీలు బలోపేతం కావాలి

- కుమారస్వామి ప్రమాణ స్వీకార వేదికగా ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే ప్రయత్నం
- భాజపాకు వ్యతిరేకంగా ఓటు వేసిన వారికి కృతజ్ఞతలు
- భాజపా మోసాలను అందరి దృష్టికి తీసుకువెళతా
- నవ్యాంధ్ర సీఎం చంద్రబాబు నాయుడు



బెంగళూరు: బెంగళూరు పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కుమారస్వామి ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు బెంగళూరుకు వెళ్లిన ఆయన.. తన పిలుపు తరువాయి 2లో

## హెల్త్ మినిస్టర్‌ని నియమించండి

- లేదా 48 గంటల్లో నిరాహార దీక్ష చేస్తా
- ప్రజలు అనారోగ్యంతో చనిపోతుంటే పట్టదా?!
- ఇది చాలా సిగ్గుచేటు
- మండే ఎండలో పవన్ మాటల తూటాలు



శ్రీకాకుళం: జనసేన అధినేత పవన్ స్టార్ 2019 ఎన్నికలే లక్ష్యంగా చేపట్టిన పోరాట యాత్ర నాలుగో రోజుకు చేరుకుంది. మే 20న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన పోరాట యాత్ర బుధవారం పలాసకు చేరుకుంది. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం, ప్రత్యేక హోదా, విభజన హామీలపై పోరాటం దశగా పవన్ తన పోరాట యాత్ర కొనసాగిస్తున్నారు. మండే ఎండలో మాటల తూటాలు పేల్చుతూ జనసైనికుల్లో నూతన ఉత్సాహం నింపుతున్నారు పవన్ కళ్యాణ్. బుధవారం ఉదయం శ్రీకాకుళం జిల్లా పలాసలో ఉద్దానం కిడ్నీ బాధితులతో సమావేశమైన పవన్ కళ్యాణ్. వచ్చే 48 గంటల్లో ప్రభుత్వం కిడ్నీ బాధితుల్ని ఆదుకోకపోతే నిరాహారదీక్షకు కూర్చుంటా అంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ..

ప్రజలు అనారోగ్యంతో చనిపోతుంటే.. మీకు తిండి ఎలా తినగలుగుతున్నారో నాకు అర్థం కావడం లేదు. మీకు కనీసం హెల్త్ మినిస్టర్ ఉండాలనే ఇంకిత జ్ఞానం లేదు. ఇంగితజ్ఞానం లేకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఏడు మండలాల జనం కిడ్నీ సమస్యలతో చనిపోతుంటే.. మీలో స్పందన రావడం లేదంటే సిగ్గుచేటు. ఇది చాలా బాధాకరం. 48 గంటల్లోపు ఆరోగ్య శాఖా మంత్రిని తరువాయి 2లో

## ఆభరణాలు దొరకకపోతే రాజీనామా చేస్తా

- బాబు ఇంట్లో ఆరణాలు విదేశాలకు తరలిపోతాయ్
- 12 గంటలలోగా పట్టుకోండి
- వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి సవాల్



విశాఖపట్నం: తిరుమల తిరుపతి దేవస్థానంలోని పోటు నేల మాళిగలలోని విలువైన ఆభరణాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి, హైదరాబాద్‌లోని ఆయన నివాసాలకు తరలించారని చూస్తున్నారని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి ఎంపీ విజయసాయి రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని తన రాజసౌధంలోను, అమరావతిలోని తన నివాసంలోను చంద్రబాబు ఆభరణాలను దాచిపెట్టారని ఆరోపించారు. 12 గంటల్లోగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) లేదా తెలగాణ పోలీసుతో చంద్రబాబు నివాసంలో తనిఖీలు నిర్వహిస్తే ఆభరణాలు బయపడతాయని ఆయన వ్యాఖ్యానించారు. 12 గంటల లోగా దాడు నిర్వహించి, చంద్రబాబు ఇంట్లో ఆభరణాల బయటపడకపోతే నిమిషం దాటిన తరువాత తరువాయి 2లో

## దత్తాత్రేయకు పుత్రశోకం

- గుండెపోటుతో మృతిచెందిన ఏకైక కుమారుడు
- తీవ్ర విషాదంలో దత్తాత్రేయ కుటుంబం
- ఉపరాష్ట్రపతి, చంద్రబాబు, ప్రముఖుల సంతాపం



హైదరాబాద్: కేంద్ర మాజీ మంత్రి, భాజపా సీనియర్ నేత బండారు దత్తాత్రేయ ఒక్కగానొక్క కుమారుడు వైష్ణవ్ (21) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం రాత్రి 10.45కు తరువాయి 2లో






# మున్సిపాలిటీలను పరిశుభ్రంగా ఉంచండి

## జిల్లా కలెక్టర్ డా. హరి జవహర్ లాల్



విజయనగరం : మున్సిపాలిటీ పరిధిలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ హరిజవహర్లాల్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. వేకువజామునే పర్యటనకు బయలుదేరిన కలెక్టర్ పాత బస్ స్టాండ్, పూల్ బాగ్ కోలనీ తదితర ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్య సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. అనంతరం పట్టణంలోని రాజీవ్ క్రీడా మైదానాన్ని పరిశీలించారు. క్రీడా మైదానంలో వందలాదిమంది వ్యాయామాలు చేసుకోవటంతో పాటు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వ హించడం గమనించి స్టేడియం చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆ ప్రాంతంలో పారిశుధ్యం అత్యంత దారుణంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వారం రోజుల్లోగా శు భ్రపరచాలని ఆదేశించారు. అదేవిధంగా స్టేడ ియం లోపల మందు బాటిళ్లను గాజుపెంకు లను గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశం చారు. గత హుదూద్‌లో పాడైన ఇండోర్ స్టేడియం పరిశీలించి దాని మరమ్మతులపై ఆరా తీశారు. రహదారులు భవనాలశాఖ పర్యవేక్షక ఇంజనీర్‌తో మాట్లాడి అందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రధాన ఇంజనీర్ కార్యాలయంలో పెండింగులో ఉన్నాయని తెలుసు కున్నారు. ప్రధాన ఇంజనీర్‌తో సంప్రదించి అనుమతులు తెప్పిస్తానని త్వరతగతిన పనులు పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకు రావాలని కలెక్టర్ ఎస్.ఇ. ని, సెట్విజ్ సి.ఇ.ఓ.ను ఆదేశించారు. పర్యటనలో భాగంగా పెద్ద చెరువు ప్రాంతంలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు గమనించి తొలగించాలని ఆదేశం చారు. పట్టణం సుందరీ కరణలో భాగంగా అనుమతిలేని ఫ్లెక్సీలను బ్యానర్లను తొలగిం చాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం విజ్జి స్టేడియం చేరుకున్న కలెక్టర్ అక్కడ సైకిలింగ్, వాకింగ్ ట్రాక్లను పరిశీలించారు. ఈ పర్యటనలో మున్సిపల్ ఇన్‌ఛార్జ్ చైర్మన్ కనకల మురళీ మోహన్, ఇన్‌ఛార్జి కమిషనర్ ఎస్.డి.అనిత, మున్సిపల్ హెల్త్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ ఉపవాసకులకు ఇఫ్తార్ విందు



విజయనగరం: స్థానిక బాబామెట్టలోని హుజార్ హజరత్ సయ్యద్ ఖాదర్‌వలి బాబా ఆ దర్బార్ షరీఫ్‌లో గత ఆరు రోజులుగా పవిత్ర రంజాన్ ఉపవాసకులకు ఇఫ్తార్ విదు, నిత్య అన్నదానం నిర్వహిస్తున్నారు. హజరత్ ఖాదర్ బాబా శిష్యులు సుఫీ మహత్మ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ తాజ్ ఖాదరిబాబు ఆధ్వ ర్యంలో ఈ ఇఫ్తార్ విందులు జరుగుతున్నాయి.

# చింతవానిపాలెంలో పోలీసుల జనమైత్రి



గిరిజనులకు దుస్తులు అందిస్తున్న కొయ్యూరు ఎస్సై

కొయ్యూరు : ప్రజలకు, పోలీసులకు మధ్య నిత్యం స్నేహ పూర్వకమైన సంంధాలు కొనసాగితే సమాజానికి మంచి జరుగుతుందని కొయ్యూరు ఎస్సై రుక్మంధరరావు అభిప్రాయపడ్డార. బుధవారం మండలంలోని కొయ్యూరు పంచాయతీ, చింతవాని పాలెంలో కొయ్యూరు, పోలీసులు జనమైత్రి నిర్వహించి గిరిజనులకు హితబోధ చేశారు. పేదలకు చీరలు, లుంగీలు, గొడుగులు, చార్జింగ్‌లైట్లు, వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### మొదటి పేజీ తరువాయి

# ప్రాంతీయ పార్టీలు బలోపేతం కావాలి

మేరకు ఇక్కడ భాజాపాకు వ్యతిరేకంగా ఓటు వేసిన తెలుగువారికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు బెంగళూరుకు చేరుకున్న చంద్రబాబుకు అక్కడి తెలుగువారు ఘనస్వాగతం పలికారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా వివిధ ప్రాంతీయ పార్టీలను ఏకం చేసేందుకు ఈ బెంగళూరు పర్యటన అవకాశంగా మలచుకోవాలని చంద్రబాబు భావించారు. ఇందులో భాగంగానే ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం భాజపాయేతర పక్షాలను ఇందుకు అనుకూలంగా మద్దతు కోరారు.

ఎన్డీఏ నుంచి బయటకు వచ్చాక తొలిసారిగా మాయావతి, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్‌తో చంద్రబాబు బెంగళూరులో భేటి అయ్యారు. వీరితో విడివిడిగా భేటి అయిన ఆయన.. ప్రాంతీయ పార్టీల బలోపేతంపై ఈ భేటీలో చర్చించినట్లు సమాచారం. ఏపీలో పరిణామాలు, భాజపా కుట్ర రాజకీయాలను ఆయా నేతల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. తమ తమ రాష్ట్రాల్లోని పరిస్థితులను ఆయా నేతలు చంద్రబాబుకు వివరించారు. ప్రాంతీయ పార్టీలన్నీ బలోపేతం కావాల్సిన అవసరం ఉందని మమతాబెనర్జీ బాబుతో అన్నట్లు సమాచారం. కర్ణాటక పరిణామాలే ఇందుకు నాంది కావాలని నేతలు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. భాజపాకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో కూటమి అవసరం ఉందని మాయావతి ప్రస్తావించినట్లు సమాచారం. జాతీయ స్థాయిలో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలనే అంశం నేతల భేటీల్లో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది.

# హెల్త్ మినిస్టర్‌ని నియమించండి

నియమించకుండా దీనిమీద ప్రభుత్వం అనౌన్స్‌మెంట్ చేయకపోతే నిరాహారదీక్షకు కూర్చుంటా. ఆరోగ్య శాఖ మంత్రి ఉండాలి. హెల్త్ సెక్రటరీ మాట్లాడాలి. వారికి ఓ 48 గంటలు టైం ఇచ్చి చూస్తా.. స్పందన లేకపోతే నేను చేయాల్సింది చేస్తా అంటూ ప్రభుత్వానికి 48 గంటల అల్టిమేటం జారీ చేశారు జనసేన అధినేత పవన్ కళ్యాణ్.

ఆంధ్రప్రదేశ్‌లోని 175 నియోజక వర్గాల్లో సమస్యలను గుర్తించి, అధ్యయనం చేసి వాటి పరిష్కార మార్గాలు చూపుతామంటున్నారు పవన్. జనసేన పార్టీ 2019 ఎన్నికలే లక్ష్యంగా మున్ముందు రాజకీయ జవాబుదారీతనం ఉండేలా చర్యలు చేపడుతుందని వివరించారు. మే 20న ఇచ్ఛాపురం నుంచి మొదలయిన ఈ యాత్ర 45 రోజుల పాటు కొనసాగుతుంది.

# ఆభరణాలు దొరకకపోతే రాజీనామా చేస్తా

13వ గంటలో తాను రాజీనామా చేస్తానని ప్రకటించారు. 12 గంట కంటే ఎక్కువ సమయం చంద్రబాబుకు ఇస్తే తిరుమల ఆభరణాల విదేశాలకు తరలిపోతాయని అన్నారు. కేవలం హెరిటేజ్ వ్యాపారంతోనే చంద్రబాబు ఇన్ని ఆస్తులు కూడబెట్టారంటే సాధ్యమైన పని కాదని ఆయన చెప్పారు.

తన కుమారుడు లోకేష్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని అంటున్న చంద్రబాబు ఎందుకు సీబీఐ విచారణను కోరడం లేదని విజయసాయి రెడ్డి ప్రశ్నించారు. హిందూ ధార్మిక సంస్థకు చెందిన ఆస్తులను దోచుకున్న వారెవరూ బాగుపడలేదన్నారు. టీడీపీ చేస్తున్నది ధర్మపోరాటం కాదని, తెలుగు దొంగల పార్టీ చేస్తున్న అధర్మ పోరాటమని ఎద్దేవా చేశారు. అసలు చంద్రబాబు ధర్మపోరాటం ఎవరిపైన చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికార ప్రభుత్వం ధర్మపోరాటం ఎవరి మీద చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలకి న్యాయం చేయాల్సిన వారే రాష్ట్ర ప్రజలని దోచకుంటున్నారు. చట్టవిరుద్ధమైన పనులు చేస్తూ తెలుగుదేశం పార్టీ కాస్త.. తెలుగు దొంగల పార్టీగా మారిందన్నారు. మూడు లక్షల కోట్ల రూపాయలు ప్రజల సొమ్ము కొల్లగోట్టి ధర్మపోరాటం పేరుతో ప్రజలను మభ్య పెడుతోందన్నారు. ధర్మపోరాటం పేరుతో ప్రజల సొమ్మును లూటీ చేస్తున్నారన్నారు. ఈ విషయాన్నింటినీ ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. టీడీపీది ధర్మపోరాటం కాదని, అధర్మ పోరాటమని ప్రజందరికీ తెలియజేసేందుకు ఆసభ జరిగిన ప్రదేశంలో శుద్ధి చేసే కార్యక్రమాన్ని తపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడివాడ అమర్‌నాథ్, వరుదు కల్యాణి, యు.వి.రమణమూర్తి రాజు, సనపల చంద్రమౌళి, వంశీకృష్ణ శ్రీనివాస్, కోలా గురువులు, తిప్పల నాగిరెడ్డి, అదీప్ రాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొండా రాజీవ్‌గాంధీ, రామన్నపాత్రుడు, నీలాపు కాళిదాసు రెడ్డి, బోని శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయకు పుత్రశోకం

వైష్ణవ్ గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హైదరాబాద్‌లోని తన స్వగృహంలో భోజనం చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ముషీరాబాద్‌లోని గురునానక్ కేర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 12.30 గంటలకు మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. వైష్ణవ్ ఎంబీబీఎస్ మూడో ఏడాది చదువుతున్నారు.

కుమారుడి మృతితో షాక్‌కు గురైన దత్తాత్రేయ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వైష్ణవ్ మృతదేహాన్ని బంధువుల సందర్శనార్థం స్వగృహంలో ఉంచారు. ఆడుతూ పాడుతూ సరదాగా ఉండే వైష్ణవ్ ఇక లేడని తెలుసుకున్న బంధువులు, స్నేహితులు అతడిని కడసారి చూసేందుకు తరలివచ్చారు

వెల్లువెత్తుతున్న సంతాపాలు

కుమారుని హఠాన్మరణం పట్ల సంతాపాలు వెల్లవెత్తుతున్నాయి. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఫోన్ చేసి దత్తాత్రేయను పరామర్శించారు. భాజపా ఎమ్మెల్యే లక్ష్మణ్, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, జనసమితి వ్యవస్థాపకులు కోదండరామ్ తదితరులు దత్తాత్రేయ నివాసానికి చేరుకుని ఆయన్ని పరామర్శించారు.

చంద్రబాబు సంతాపం

బండారు దత్తాత్రేయ కుమారుడు వైష్ణవ్ హఠాన్మరణంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రగాఢ సంతాపం తెలిపారు. వైష్ణవ్ చిన్న వయసులోనే కుటుంబానికి దూరం కావడం పెనువిషాదమన్నారు. ఎంబీబీఎస్ చేస్తూ భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్న వైష్ణవ్ అకాల మరణానికి గురికావడం కలచి వేసిందన్నారు. ఒక్కగానొక్క కొడుకు ఆకస్మిక మరణం ఎంతో బాధాకరమని, దత్తాత్రేయ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# అడ్డదారిలో సాగు భూమి ఆక్రమణ



తహశీల్దార్‌కు విన్నవిస్తున్న బాధితులు

కొయ్యూరు : తనకున్న అంగ, అధికారులతో ఎంపిపి గొలిసింగి సత్యనారాయణ తాము ఏళ్ల తరబడి సాగులో ఉన్న భూమిని అడ్డదారిలో ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నాడంటూ మండలంలోని మర్రివాడ పంచాయతీ దొడ్డవరం, తాళ్లపాలెం గ్రామానికి చెందిన తల్లీకొడుకులు సోమెలలక్ష్మి, సోమెల వెంకటరమణలు ఆరోపిస్తున్నారు. బుధవారం తహశీల్దార్ రమాదేవికి ఫిర్యాదు చేసిన అనంతరం వారు స్థానిక విలేకరుల ముందు తమ గోడును వినిపించారు. పెద్దినపాలెం రెవెన్యూ గ్రామ పరిధిలో గల సుమారు ఆరు ఎకరాల భూమిని తాము ఏళ్ల తరబడి సాగు చేసుకుంటూ అందులో జీడిమామిడి తోటను పెంచా మన్నారు.

తమకు ప్రభుత్వం 1990 సంవత్సరంలోనే డిఫారం పట్టా కూడా ఇచ్చిందని, అడంగల్ కూడా తమ పేరిట నమోదై ఉందని వివరించారు. అటువంటిది తమ బలహీనతను ఆసరాగా చేసుకున్న ఎంపిపి భూమిని ఎలాగైనా స్వాధీనపర్చుకునేందుకు తమ కుటుంబీకులను రంగంలోనికి దించి వెనుకుండి కథ నడిపించి ఉంటారని దుయ్యబట్టారు. దౌర్జన్యంగా తాము వేసుకున్న మొక్కలను కూడా ఎంపిపి పీకించివేశారన్నారు. ఈ విషయమై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. బాధితుల మేరకు ఈ విషయమై తగు విచారణ చేసి చర్యలు చేపడతామని తహశీల్దార్ రమాదేవి తెలిపారు.

ఈ విషయమై ఎంపిపి గొలిసింగి సత్యనారాయణను వివ రణ కోరే ప్రయత్నం చేసినప్పటికీ ఆయన ఫోన్‌లో అందుబాటులో లేరు.

# చిత్తశుద్ధి వుంటే రాజీనామాలు చేయించండి

## చంద్రబాబుకు ఎమ్మెల్సీ కోలగట్ల సవాల్



విజయనగరం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి చిత్తశుద్ధి వుంటే తన ఎంపీలచేత ఇప్పటికైనా రాజీనామా చేయించాలని వైకాపా ఉత్తరాంధ్ర కన్వీనర్, ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి సవాల్ విసిరారు. బుధవారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హెూదా కోసం వైకాపా ఎంపీలు రాజీనామా చేశారన్నారు. ఆ రాజీనామాలను ఆమోదింపజేసుకునే ప్రయత్నాన్ని ముమ్మరం చేశారని, టిడిపి ఎంపీలు రాజీనామాకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు అధర్మపోరాటాన్ని, ఆధర్మ రాజకీయాలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వెన్నుపోటుతోనే బాబు ఆధర్మరాజకీయం ప్రారంభమైందని, అసలు బాబే ఒక ఆధర్మవ్యక్తి అని విమర్శించారు. నాలుగేళ్లు బిజెపితో చెట్టాపట్టాలు వేసుకుని తన రాజకీయ లబ్ధికోసమే ప్రస్తుతం మొసలికన్నీరు కారుస్తున్నారని అన్నారు. తొలుత ప్రత్యేక హెూదా వద్దు అన్నది బాబేనని, ప్యాకేజీతో సరిపెట్టిన ఘనత కూడా ఆయనదేనని నొక్కి చెప్పారు. హైదరాబాద్ పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉన్నప్పటికీ ఓటుకు నోటు కేసు విషయంలో కేసీఆర్‌కి సలాంచేసి ఆంధ్రాకి వచ్చేశారని విమర్శించారు. రియల్‌ఎస్టేట్‌కు భూములను దారాదత్తం చేసి, ఎక్కడికక్కడ చెట్లు కొట్టేసి ఇప్పుడేమో ఉష్ణోగ్రతలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం విడ్డూరంగా ఉందన్నారు. ఓట్లు దండుకోవడానికి వైకాపాకి, బిజెపికి లింకుపెడతారా అని బాబుని ప్రశ్నించారు.

ఇప్పటికి కూడా ప్రధాన మంత్రి మోదీతో బాబుకు లోపాయికారి లాలూచీ ఉందని ఆరోపించారు. దేవాలయాలను పడగొట్టి ప్రజల మనోభావాలను దెబ్బతీసిన ఘనత కూడా చంద్రబాబుదేనన్నారు. చంద్రబాబునాయుడు సామాజిక వర్గం మాత్రమే బాగుపడుతోందన్నారు. రైతులు, ఉద్యోగులు, యువత ఆఖరికి తెలుగు తమ్ముళ్లను కూడా బాబు మోసం చేసారని అన్నారు. ఓటును అడిగే హక్కు బాబుకు లేదని ప్రజలకు బహిరంగ క్షమాపన చెప్పాలని కోలగట్ల డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఎస్‌వివి రాజేష్, నాయకులు ఆశపువేణు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర అభివృద్ధి రైల్వే జోన్‌తోనే సాధ్యం

## స్వాతి కృష్ణారెడ్డి మేడపాటి



విశాఖపట్నం : ప్రత్యేక రైల్వే జోన్ సాధన ఉత్తరాంధ్రుల హక్కు నినాదంతో స్వాతి కృష్ణారెడ్డి పాదయాత్ర, లక్ష సంతకాల సేకరణ, మూడవ రోజుకు చేరింది. మురళీనగర్, ఎస్సీ మరియు ఎస్టీ కాలనీలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి స్వాతి కృష్ణారెడ్డి పూలమాల వేసి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వనరులు ఉన్నా విశాఖకు ఎందుకో రైల్వే జోన్ ప్రకటించడం లేదని విచారం వ్యక్తం చేశారు. విశాఖకు రైల్వే జోన్ వస్తే ఉత్తరాంధ్ర జిల్లాలకు 5 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు వస్తాయని తద్వారా సంస్థలు ఏర్పడతాయన్నారు. నిరుద్యోగ సమస్య తొలగి ఇంటికో ఉద్యోగమైనా దొరికే అవకాశం ఉంటుందని అన్నారు. అనేక కొత్త రైళ్లు వస్తాయని, టికెట్ల రూపంలో మన ఆదాయం పెరిగి అభివృద్ధి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. విశాఖపట్నం డివిజన్‌కు ప్రత్యేక జోన్ కేటాయించాలని, ఎందుకు ఇవ్వరని స్వాతి కృష్ణారెడ్డి ప్రశ్నించారు. దశాబ్దకాలంగా ప్రత్యేక రైల్వే జోన్ కోసం పోరాటాలు సాగుతున్నా కేంద్రం ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు ప్రదర్శిస్తున్నారో అర్థం కావటం లేదని ప్రశ్నించారు.

ఇది చాలా దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా రైల్వే జోన్ ప్రకటించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎం.డీ., రమేష్ రెడ్డి, ఇతర ప్రతినిధులు హాజరయ్యారు.

# స్త్రీ నిధి రుణ లక్ష్యం రూ.80 కోట్లు : స్త్రీనిధి ఎండి ఈదర రాంబాబు



విజయనగరం : ఆర్థిక సంవత్సరంలో రూ.80 కోట్లు లక్ష్యంగా నిర్ధేశించామని స్త్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్ ఈదర రాంబాబు పేర్కొన్నారు. బుధవారం డిఆర్‌డిఎ కార్యాలయం సమావేశ మందిరంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్లు, ఎపిఎంలతో స్త్రీనిధి రుణాల మంజూరుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆదాయం రూ.10వేలు సంపాదించే విధంగా ఆదాయ కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. డిపిఎం పరిధిలో 920 గ్రామ పంచాయతీలుండగా 495 పంచాయతీలకు మాత్రమే స్త్రీనిధిలో రుణాలు మంజూరు చేసారని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ సభ్యులకు ఉన్నతి రుణాలు, ఓబిసిలకు సాధారణ రుణాలు అందించాలన్నారురు. స్త్రీనిధి డెత్ క్లైయిమ్‌లు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో మహిళా బ్యాంకులు ఏర్పాటు చేసి రుణాలు అందిస్తామన్నారు. డిఆర్‌డిఎ పథక సంచాలకులు కె.సుబ్బారావు మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు పెద్ద ఎత్తున అందించాలన్నారు. స్త్రీనిధి రుణాలపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సిసిలు, ఎపిఎంలు, ఎసిల పరిధిలో గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందించి, డిసెంబర్ నాటికి నూరుశాతం రికవరీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎపిడి మురళి, స్త్రీనిధి ఎజిఎం వి.సత్యనారాయణ, మేనేజర్ కె.హేమలత, ఎసిలు ఎల్.రాజ్యలక్ష్మి, కె.స్వర్ణకుమారి, బి.బంగారమ్మ, ఎపిఎంలు తదితరులు పాల్గొన్నారు.


GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

VIZAG ...ahead

'e' Procurement Tender Notice No:11/2018-19/E.E-II/DB, Dt:22-05-2018

| | | |
|---|---|---|
| 01. | Number of Works | : 1 No. |
| 02. | Value of Works (ECV) | : Rs.5.11 Lakhs |
| 03. | Down Loading Starting Date | : 23-05-2018 @ 2.00 pm |
| 04. | Down Loading End Date | : 28-05-2018 @ 2.00 pm |
| 05. | Last date of submission of Bid | : 28-05-2018 @ 3.00 pm |
| 06. | Date of opening Tenders | : 28-05-2018 @ 4.00 pm |

Note: For any other details required in respect of above tender notice, please contact EE-II before applying for tender schedules and visit us: @ www.apeprocurement.gov.in.

For COMMISSIONER

స్వచ్ఛ ఆంధ్ర

స్వచ్ఛ విశాఖ

స్వచ్ఛ భారత్

ప్రతి ఇంటిలో వ్యక్తిగత మరుగుదొడ్డి కనీస అవసరం


# నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రావికమతం : కొత్తకోట సహకార సంఘం ద్వారా రబీ కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైతులు ప్రైవేటు వ్యాపారుల బారిన పడకుండా కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందన్నారు. దీనిలో భాగంగా గత రెండేళ్లుగా సంఘం ద్వారా ధాన్యం ప్రభుత్వానికి అందిస్తున్నామన్నారు. గత ఏడాది దాని కొనుగోలుపై రూ.8.82లక్షలు ఆదా యం రాగా, ఈ ఏడాది ఖరీఫ్‌లో 54,611 బస్తాలు కొనుగోలు చేయగా రూ.6.80లక్షలు లాభం వచ్చిందన్నారు. అలాగే దీనిలో భాగంగా రబీ కొను గోలు కూడా గురువారం నుండి ప్రారం భిస్తున్నామని ఆయన తెలిపారు. సాధారణ రకాలు కిలో రూ.15.50లు, ఏ గ్రేడ్ రకం కిలో రూ.15.90లు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# పంచగ్రామాల భూసమస్యపై మంత్రితో చర్చిస్తా

## టిడిపి విశాఖ జిల్లా అర్బన్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు సతివాడ శంకరరావు



సింహాచలంః విశాఖపట్నంలో మంగళవారం జరిగిన తెలుగు దేశం పార్టీ చేపట్టిన ధర్మ పోరాటదీక్షకు హాజరైన టిడిపి విశాఖ జిల్లా అర్బన్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు 72వ వార్డు ఎక్స్ అధ్యక్షుడు సతివాడ శంకరరావు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏ పి పంచాయతీరాజ్ మంత్రి నరా లోకేశ్‌ను కలిసి సింహాచల గ్రామప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై విన్నవించారు.

ముఖ్యంగా పంచగ్రామల భూసమస్య హక్కులు కౌలు రైతులకు న్యాయం చేయాలనీ అంతేకాక దేవస్థాన సిబ్బంది దాడులు ఆపించి ప్రజలకు, రైతులకు న్యాయం చేయలని కోరారు. మంత్రి స్పందిస్తూ వెంటనే చంద్రబాబు దృష్టికి ఈ విషయాలు తీసుకు వెళ్లి తగు న్యాయం చేస్తామని తెలిపాపని సతివాడ తెలిపారు.

# 'స్టెరిలైట్'కాల్పులను ఖండించండి

విశాఖపట్నంః తమిళనాడులోని తుత్తుకుడి జిల్లా స్టెరిలైట్ కంపెనీ వద్ద జరిగిన కాల్పులో 11 మందికి పైగా మరణించారని సిపిఐ(ఎం) శాఖ విశాఖపట్నం తెలియజేసింది. అందులో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. ప్రజలపై జరిగిన పోలీసు దమానకాండను సిఐటియు ఆంధ్రప్రదేశ్ కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. స్టెరిలైట్ కంపెనీని వెంటనే మూసేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కర్మాగారం వల్ల చుట్టూ వున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. నీరు పూర్తిగా కాలుష్యమైంది. గత్యంతరం లేక నూరు రోజుల నుంచి ఆందోళన కొనసాగిస్తున్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం 144 సెక్షన్ విధించి 4వేల మంది పోలీసుల్ని సమీకరించి ప్రజలపై ఉసిగొల్పింది. పోలీసులు హెచ్చరిక లేకుండా ప్రజలపై కాల్పులు జరిపారు. 11 మంది నేలకొరిగారు. దేశంలోనే కాలుష్యంపై జరిగిన పెద్ద తిరుబాటు. స్టెరిలైట్ యాజమాన్యం కాలుష్య కంపెనీలు పెట్టి ప్రభుత్వాలను తమ గుప్పెట్లో పెట్టుకొని ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నది. తత్తుకుడిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతునందువల్లనే 50వేల మంది రోడ్లుపైకి వచ్చి నిరసన తెలియజేసారు. తమిళనాడులోనే కాకుండా దేశంలోని అన్ని సముద్రతీరాల వద్ద బహుళజాతీ సంస్థలు ఇటువంటి కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. ే విశాఖలోని హిందుస్తాన్ జింక్ ప్రభుత్వరంగ పరిశ్రమను 2003లో వేదాంత కంపెనీ తీసుకొని 2013లో మూసివేశారు. హిందుస్తాన్ జింక్‌పై 2018 జనవరిలో టిడిపి ప్రభుత్వం స్టెరిలైట్ యాజమాన్యంతో ఒప్పందం చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను స్టెరిలైట్ యాజమాన్యానికి అమ్ముడుపోయి ప్రజలకు ద్రోహం చేస్తున్నాయి. ప్రజలంతా ఐక్యంగా పోరాడడమే సరైన మార్గమని పిలుపుచిచ్చామని తెలిపారు.

# అప్పన్న హుండీల లెక్కింపు



సింహాచలంః సింహగిరిపై వేంచేసి యున్న శ్రీ సింహాద్రి నాథుని హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం సింహగిరిపై జరిగింది.

దేవస్థానం ఇన్‌చార్జి ఈ ఓ ఎస్ వి ఎన్ మూర్తి పర్యవేక్షణలో జరిగింది. 13 రోజులకు గాను భక్తులు నగదు రూపంలో 78 80 476 /-లక్షల రూపాయలు, బంగారం 0 133 000 గ్రాములు, వెండి 7 779 000 గ్రాములు. అలాగే విదేశీ కరెన్సీ యూ ఎస్ ఏ 56 డాలర్లు, యూ ఏ ఈ 115 దీరామ్స్, ఎస్ బి ఐ పాకిస్థాన్ 200 రూపాయల సింగపూరు 2 డాలర్లు, ఆస్ట్రేలియాన్ 10 డాలర్లు, బ్యాంక్ ఆఫ్ మలేషియా 1 ఆర్ ఎం సౌదీ 1 రియాద్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్ 1 రియాద్ సౌతాఫ్రికా 20 రౌడ్, శ్రీలంక 120 రుపీస్, బ్యాంక్ సెంట్రల్ డి కోస్టారికా 5000 కలర్ సెంట్రల్ బ్యాంక్ కువైట్ 1 /4 దిరంస్ సమకూరాయి.

ఈ లెక్కింపు కార్యక్రమంలో ఏ ఈ ఓ కృష్ణమాచార్యులు, వై శ్రీనివాస్, సూపరింటెండెంట్ తిరుమలేశ్వరరావు రమణమూర్తి మరియు ఇతర దేవస్థాన సిబ్బంది మరియు స్వచ్ఛంధ సేవకుల పాల్గొన్నారు.

# నియోజక వర్గాన్ని శాయశక్తులా అభివృద్ధికి కృషి



మాధవధార : ఉత్తర నియోజక వర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఉత్తర నియోజక వర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తెలిపారు. మంగళవారం 39వ వార్డులో వివిద పనులను ఆయన శంకుస్థాపన చేసి ప్రారంభించారు. రూ.19 లక్షల 90 వేలతో డ్రైన్లు, కల్వర్టు, రోడ్లు అదేవిదంగా ఉడాకాలనీలో ఉన్న డ్రైన్లు, కల్వర్టులకు శంకుస్థాపన చేశారు. అదేవిదంగా మాధవధార రామాలయంలో బోరువెల్స్‌కు శంకుస్థాపన చేశారు. మాధవధార ప్రదాన రహదారి వద్ద యుజిడి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర నియోజక వర్గం ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తర నియోజక వర్గంలో ప్రజల సమస్యలు తమ దృష్టికి వస్తే పరిష్కారిస్తున్నానని తెలిపారు. అదేవిదంగా వార్డులో సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారిస్తానని తెలిపారు. తెన్నేటినగర్ పార్కును సందర్శించారు. తెన్నేటినగర్ పార్కు అభివృద్ధికి ఈ ప్రాంతంలో ఉండే ప్రజలు తమ సొంత నిధులతో ఎర్పాటు చేయ్యడం ఎంతో అభినందనీమయమని అన్నారు. ఇందుకు సహకరించిన సభ్యులను ఆయన అభినందించారు. త్వరలో ఈ పార్కులో నీటి సమస్య ఎక్కువగా ఉందని 24 గంటల నిటిసరఫరాను అందించడంతో పాటు విశ్రాంతి గృహం ఎర్పాటు చేయ్యాలని ఎమ్మెల్యేని కోరారు. అదేవిదంగా మాధవధారలో గల శ్రీ మాధవ యువజన సమాజం సభ్యులు కుంచు మాంబ అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలకు ఇబ్బందులు ఎదురవు తున్నాయని 24 గంటల నీటి సరఫరాను ఎర్పాటు చేయ్యలని వినతి పత్రం అందజేశారు.

త్వరలో సమస్యలను పరిష్కారిస్తానని ఎమ్మెల్యే హమి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యాక్షులు సనపల వరప్రసాద్, 39వ వార్డు బిజెపి అధ్యక్షులు సనపల రామకృష్ణ, బిజెపి నాయకురాలు పధ్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు పప్పల రామరాజ్యం, యుజిడి ఈఈ రామ్మోహన్‌రావు, పబ్లిక్ వర్క్స్ ఎఇలు గుప్త, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ వర్క్‌లో ఆశాకిరణ్‌కు డాక్టరేట్

## ఉత్తర్వులు అందజేసి అభినందించిన వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



ఆంధ్రవిశ్వవిద్యాలయం : సోషల్ వర్క్ విభాగ పరిశోధక విద్యార్థి చదువుల ఆశా కిరణ్ రాజుకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. విభాగాధిపతి ఆచార్య టి.శోభశ్రీ పర్యవేక్షణలో 'విశాఖ జిల్లా పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో స్వయం సహాయక బృందాలలో సభ్యులుగా ఉన్న మహిళల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై జరిపిన అధ్యయనం'కు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు బుధవారం తన కార్యాలయంలో ఆశాకిరణ్‌కు ఉత్తర్వులు అందజేసి అభినం దించారు. సామాజిక ప్రాధాన్యత, ఉపయోగిత కలిగిన అంశాలపై పరిశోధనలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆచార్య టి.శోభశ్రీ పాల్గొన్నారు.

# గీతం బోధనేతర సిబ్బందికి నైపుణ్యా శిక్షణ తరగతులు





సాగర్‌నగర్ః గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బందికి వేసవి నైపుణ్య శిక్షణ తరగతులను బుధవారం తేది:23-05-2018 న గీతం స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్‌లో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు ముఖ్యఅతిదిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనేతర సిబ్బంది తమ వద్దకు వచ్చే ప్రతి ఫైలు పై అవగాహన పెంచుకోవాలని, ఉన్నతాధికారులకు పంపే సమయంలో బాద్యాతాయతంగా వ్యవహరించాలని సూచించారు.యు.జి.సి తదితర సంస్థలు, ప్రభుత్వం నుంచి వచ్చే జి.ఓలను పూర్తిగా అర్ధం చేసుకున్న తరువాత ఫైళ్ళను తగు సమాచారం, సూచనలతో పై అధికారులకు పంపాలన్నారు. అవగాహన లేకుండా తీసుకునే నిర్ణయాలు ఒక్కోసారి కొందరి జీవతాలపై ప్రభావం చూపుతాయన్నారు.కంప్యూటరీకరణ తరువాత కార్యలయాలలో పనిచేసే ఉద్యోగుల పని సరళతరం అయినప్పటికీ ఎప్పటికప్పుడు సాంకేతికతపై అవగాహన పెంచుకోకపోతే విధి నిర్వహణలో వెనకబడతారన్నారు.

గీతం సెంటర్ ఫర్ లెర్నింగ్ అండ్ సస్టైనబిలిటీ డైరక్టర్ ప్రొఫెసర్ ఎస్.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ ఉద్యోగస్తులలో ఆత్మవిశ్వాసం, మెరుగైన పనితీరు పెంచేవిధంగా 11 రోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని వినూత్నంగా రూపొందించామన్నారు.

కార్యక్రమంలో గీతం ప్రోవైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.శివరామ కృష్ణ, ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.షీలా ,ప్రొఫెసర్ గణపతి , ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ కనకలక్ష్మి, డాక్టర్ ఎస్.పి.రావు, ప్రొఫెసర్ లక్ష్మి ప్రసాద్, డాక్టర్ బి.నళిని, డాక్టర్ రాజుగోపాల్, డాక్టర్ కాశీ తదితరులు పాల్గొన్నారు.

# విమాన రాకపోకలకు ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి


## -జిల్లా సంయుక్త కలెక్టర్ జి.సృజన



విశాఖపట్నం: విమాన రాకపోకలకు ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె అధ్యక్షతన ఎయిర్‌ఫీల్డు ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో జరిగింది. ఎయిర్‌పోర్టు, ఐఎన్ఎస్ డేగా, నేవీ, పోర్టు, జివియంసి, ఇరిగేషన్, పోలీస్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు తదితర శాఖలకు చెందిన అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.హెచ్.ఆదిల్ మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు తీరుతో పాటు ప్రస్తుతం విమాన రాకపోకలకు ఎదురవుతున్న సమస్యలను అధ్యక్షుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో పెరిగిపోతున్న మొక్కలు, ఘన వ్యర్థాలను వెంటనే తొలగించాలని జివియంసి అధికారులను ఆదేశించారు. ఈ వ్యర్థాల వల్లనే గెద్దలు, పక్షులు ఆ ప్రాంతంలో ఎక్కువగా సంచరించడం జరుగుచున్నదంటూ ఈ విషయంలో స్థానికులకు అవగాహన కల్పిస్తే కూడా మంచి ఫలితాలు ఉంటాయని అధికారులకు ఆమె సూచించారు. మేఘాద్రిగెడ్డ, కొండగెడ్డల నుండి వచ్చే నీటి వల్ల విమానాశ్రయం చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో నీరు ఎక్కువ నిల్వ వుంటుందని, ఈ సమస్య పరిష్కారానికి పటిష్టమైన డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆమె అన్నారు. బీచ్‌రోడ్డు, జగదాంబ ప్రాంతాల్లో ఫోకస్ ల్యాంప్‌లు, బెలూన్ల వినియోగం విచ్చలవిడిగా జరగడం వల్ల విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నందున, వీటిని నియంత్రించాలని పోలీస్ అధికారులకు ఆమె సూచించారు.

ఎయిర్‌పోర్టు మేనేజర్ (ఎ.టి.సి) డి.సంతోష్‌కుమార్, మేనేజర్ వేణుగోపాల్, సి.డి.ఆర్.పంకజ్ మోంగియా, ఎం.వి.గోవిందరాజులు, డా.ఎల్.కె.సుధాకర్, ఇఇఎస్.చిరంజీవులు, పి.శశిభూషణరావు, ఆర్.లక్ష్మినారాయణ, సి.పరమేశ్వర్, వి.పి.టి.అధికారి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రోడ్ మార్జిన్స్ ఆక్రమించకుండా చూడండి




- ఆశీల్‌మెట్ బార్, హొటల్ రాజ్ దర్బార్‌లకు జరిమానా
- మంచుకొండ జెమ్స్, సంగం -శరత్ రోడ్ మార్జిన్స్ శుభ్రపరచండి
- ఖాళీగా ఉన్న విద్యుత్ స్తంభాలను యుద్ద ప్రాతిపదికన తొలగించండి
- డ్రెయిన్స్ కార్నర్లు, మేన్ హొల్స్ మరమ్మతు నిర్వహించండి
- మొక్కలు పెంపకానికి ప్రాధాన్యతనివ్వండి
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: రోడ్ మార్జిన్స్ ఆక్రమించకుండా చూడాలని జివియంసి కమిషనర్ హరినరాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ఆశీల్‌మెట్, హొటల్ రాజ్‌దర్బార్, నవరత్న జ్యూయల్ మార్ట్ వద్ద రోడ్ మార్జిన్స్ ఆక్రమించిన శ్రీనివాస ట్రావెల్స్, జూమ్ బస్సులు, ట్రావెల్స్ మినీ బస్సుకు ఒక్కో వాహనానికి రూ. 5,000లు చొప్పున జరిమానా విధించారు. మంచుకొండ జెమ్స్, సంగం శరత్ రోడ్ మార్జిన్స్‌ను శుభ్రపరచాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న విద్యుత్ స్తంభాలను యుద్ద ప్రాతిపదికన తొలగించాలని ఇ.ఇ వెంకటిని ఆదేశించారు. గీతా ఇన్ వద్ద యుజిడి ఓపెన్ అయి ఉండడంతో రీస్టోర్ చేయాలని పేర్కొన్నారు. డ్రెయిన్స్ కార్నర్లు, మేన్ హొల్స్ మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. డైమండ్ పార్కులో ఖాళీగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఏ.ఇ నాయుడును ఆదేశించారు. రహదారికి ఇరువైపుల ఉన్న మొక్కలకు ప్రూనింగ్ చేయాలని పేర్కొన్నారు. పర్యటనలో రెండవ జోనల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇ.ఇ వెంకటి, ఏసిపి నాయుడు, ఏ.ఇ నాయుడు తదితరులు పాల్గొన్నారు.









# విజయభాను సంపాదకీయం

## అభివృద్ధి ప్రస్థానంలో భారత్

ఐశ్వర్యవంతమైన దేశాల్లో భారత్ ఆరోస్థానం ఆక్రమించి అభివృద్ధి ప్రస్థానంలో దూసుకుపోతున్నది. ఈ మేరకు మారిషస్‌కు చెందిన ఆఫ్ ఆసియా బ్యాంకు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తిగత సంపద వృద్ధినే దేశ సంపదగా పరిగణిస్తూ చేసిన అధ్యయనంలో వెల్లడైంది. మన దేశం సంపదసృష్టిలో అభివృద్ధి చెందిన ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా, ఇటలీ దేశాలను వెనక్కునెట్టేసి సిరిసంపదలో అగ్రరాజ్యాలతో పోటీపడటం ఆశ్చర్యం కలిగించేదే. ఈ క్రమంలో మరో పదేండ్లలో బ్రిటన్, జర్మనీలను కూడా అధిగమించి సంపదలో నాలుగో స్థానం ఆక్రమిస్తుందని ఆఫ్ ఆసి యా బ్యాంకు తెలిపింది. ఈ క్రమంలోనే వచ్చే పదేండ్లలో ఐశ్వర్య సూచీలో అమెరికా, చైనా, జపాన్‌లే సంపదలో అగ్రాసనం నిలుపుకుంటాయని కూడా వివరించింది. దేశంలో నివసిస్తున్న ప్రజలందరి ఆస్తుపాస్తులు లెక్కించి అంతర్జాతీయ సంపద, వలస సమీక్ష పేరిట ఆఫ్ ఆసియా బ్యాంకు ఈ అధ్యయనం చేయటం గమనార్హం. విషయమేమంటే వ్యక్తిగత ఆస్తులను దేశ సంపదగా, ప్రజలందరి ఆస్తిగా పరిగణించటంలోనే సమస్య ఉన్నది. నిజానికి దేశ ప్రజలందరి జీవన ప్రమాణాలను ప్రాతిపదికగా, ప్రామాణికంగా పరిగణించకపోవటం విడ్డూరమే. ఇంకా చెప్పాలంటే ఆహార లభ్యత పేదరికం, విద్య, వైద్యం, విద్యుత్తు, అక్షరాస్యత, మంచినీరు, గృహవస తి లాంటి మౌలిక అంశాలు ప్రాతిపదికగా చేసుకోకుండా ఐశ్వర్యాన్ని గురించి చెప్పుకోవటం వల్ల వాస్తవాలు బయటకురావు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో సంపద సృష్టి గత దశాబ్దకాలంగా వేగంగా వృద్ధి చెందుతున్నది. అమెరికా అభివృద్ధి చెందిన యూరప్ దేశాలతో సహా ఆసియా ఖండంలోని దేశాలు ముఖ్యంగా చైనా, భారత్ పశ్చిమ దేశాలతో పోటీ పడుతున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో శ్రీలంక, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ కూడా ఉండటం గమనార్హం. అయితే సంపద ఎంతవేగంగా అభివృద్ధి చెందుతున్నదో అంతే వేగంగా ఆర్థిక అంతరాలు పెరిగి పోతున్నాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. చైనానే తీసుకుంటే గత పదేం డ్లకాలంలో సంపద సృష్టిలో రికార్డు స్థాపించినట్లుగానే, ఆర్థిక అంతరాలు కూడా అదే స్థాయి లో పెరిగిపోయిన తీరు కనిపిస్తున్నది. మన దేశ పరిస్థితి కూడా దీనికి భిన్నంగా ఏమీ లేదు. భారత్‌లో ఒక శాతం వ్యక్తుల దగ్గరే 22 శాతం సంపద పోగుపడి ఉన్నది. ఇలాంటి కుబేరుల సంపద ఒక ఏడాదికాలంలోనే 4.19లక్షల కోట్లు పెరిగింది. మొత్తంగా చూస్తే ఈ నయా కుబేరుల ఆస్తులు 20 లక్షల కోట్లకు విస్తరించాయని ఆక్స్‌ఫామ్ నివేదిక తెలియజేసింది. కొద్ది మంది సంపద ఇలా వృద్ధిచెందుతుంటే, మెజారిటీ గ్రామీణ ప్రజలు, పట్టణాల్లోని కార్మికులు, మురికివాడల్లోని ప్రజల పరిస్థితి కడుదయనీయంగా ఉన్నదని కొన్నాళ్లుగా అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తమ అధ్యయనాల్లో తేల్చిచెబుతున్నాయి. మనది వ్యవసాయక దేశమైనందున మెజార్టీ ప్రజలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. వారిలో మూడొంతుల మందికి సెంటు భూమి కూడా లేకపోగా, నెలకు ఐదు వేల రూపాయల ఆదాయంతో జీవితాలను నెట్టుకొస్తున్న తీరు దయనీయం. ప్రభుత్వ అంచనాలు, అధ్యయనాల ప్రకారమే ఆరు లక్షల గ్రామాలు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నాయి. మెజార్టీ ప్రజల జీవనస్థితిగతులు దుర్భరంగా ఉన్నప్పుడు దేశం సిరిసంపదలో పెద్ద దేశాలతో పోటీపడుతున్నదని సంబురపడిపోలేము. సంపద వృద్ధి, అభివృద్ధి పేర మౌలిక వసతుల కల్పనను సమాజాభివృద్ధిగా చెప్పుకోవటానికి లేదు. సంపదసృష్టి ఏ స్థాయిలో జరుగుతున్నదో అదేస్థాయిలో పంపిణీ కూడా జరుగాలి. సంపద ప్రజలందరికీ చేరాలి. పెరిగిన సంపద సమాజంలోని అన్నివర్గాల అభ్యున్నతికి భూమికగా మారాలి. కానీ ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో సంపద సృష్టి, అభివృద్ధిపై పెట్టిన శ్రద్ధ పంపకం, విస్తరణపై పెట్టడంలేదు. అయితే సంపద సృష్టి సామాజిక అంతరాలకు తావిస్తే సామాజిక అశాంతికి హేతువు అవుతుందని సామాజిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు దీనికి కనీసంగా చేపట్టాల్సిన చర్యల గురించి పట్టించుకోకపోవటంతోనే అసలు సమస్య వస్తున్నది. పెద్ద ప్రాజెక్టులు, మౌలికవనరులు, వసతులకల్పనే సర్వస్వమని కాకుండా, సమాజంలోని అన్ని వర్గాల ప్రజల జీవనప్రమాణల్లో మార్పు తీసుకువచ్చే దిశగా ప్రణాళికలు, పథకాల రూపకల్పన జరుగాలి. ఈ కోణంలో తెలంగాణ ప్రభుత్వం ముందువరుసలో ఉన్నదని చెప్పవచ్చు. సమస్త వర్గాల జీవన ప్రమాణాలకు పునాదిగా ఉండే మిషన్‌కాకతీయ, మిషన్‌భగీరథ గ్రామీణుల జీవన ప్రమాణాలలో మార్పు తెస్తుంది.

## తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు

### మున్సిపల్ కమిషన్ ప్రసాద్‌రాజు

యలమంచిలి రూరల్ : యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని ధర్మవరంలో తాగునీటి సమస్య పరిష్క రించడానికి ప్రత్యేక చర్యలు చేపడతామని స్థానిక మున్సి పల్ కమిషనర్ బాకూరి ప్రసాద్‌రాజు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పైపులైన్లు అవసరం ఉన్న చోట ఏర్పాటు చేస్తామన్నారు. కొళాయిల ద్వారా పూర్తి స్థాయిలో నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటా నని ఆయన వివరించారు. ప్రజాసమస్యలు తెలుసు కోవడానికే వార్డుల్లో పర్యటిస్తున్నామన్నారు. ప్రతీ సమస్య విధిగా పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇంటి పన్నులు సకాలంలో చెల్లించే మున్సిపల్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

## ఆదరణ పథకంకు దరఖాస్తులు చేసుకోవాలి

రోలుగుంట : గ్రామీణ, పట్టణ పేదవారికి ఉత్పాదకతను మెరుగుపర్చడం ద్వారా అదనపు ఆదాయాన్ని సృష్టించడం, ఆధునిక పథకాల వినియోగానికి తీసుకొని రావడం ద్వారా ఉత్పాదన సేవా నాణ్యతను మెరుగుపరచాలని బిసి లబ్ధిదారులకు ఆదరణ-2 పథకాన్ని ప్రారంభించడం జరిగిందని రోలుగుంట ఎంపిడిఒ శచిదేవీ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకానికి 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాలమధ్య వయస్సు కలిగి ఉండా లన్నారు. బిసి జాబితాలో ఏదైనా ఒక ఉపకులమునకు చెందినట్లు మీ సేవ ద్వారా కులధృవీకరణ పత్రాలు పొందాలన్నారు. బిసి లబ్ధిదారులు ప్రజాసాధికార సర్వేలో పేరు నమోదు చేసుకొని ఉండాలన్నారు. దరఖాస్తులను http:www.adarana.ap.gov.inకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## వదంతులు నమ్మొద్దు

కొయ్యూరు : మండలంతో పాటు జిల్లాలో ఎక్కడా బీహార్ తదితర ప్రాంతాల గ్యాంగ్‌లు తిరగడం లేదని కొయ్యూరు ఎస్సై రుక్మంగదరరావు తెలిపారు. ఇటువంటి అపోహలను ప్రజలు నమ్మొద్దని కోరారు. జిల్లాలో నేరప్రవృత్తి గల గ్యాంగ్‌లు సంచరిస్తున్నాయనే సమాచారం అవాస్తవమని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ వస్తున్న వాటిని వైరల్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. పిల్లలు, మహిళలను ఎత్తుకుపోతున్నారన్న పేరుతో మానసిక స్థితి బాగోలేని వారిపై దాడులు జరుగు తున్నాయన్నారు. ఎక్కడైనా ఒక వేళ కొత్తవారు కన్పించి అనుమానం వస్తే తమ దృష్టికి తీసుకురావాలే తప్ప ఎటువంటి భౌతిక దాడులకు దిగవద్దని ఎస్సై కోరారు. సెల్: 9440904211, 08837-238433కు ఫోన్ చేసి తెలపాలని రుక్మంగధరరావు కోరారు.

## గాజువాకను ఎంతో అభివృద్ధి చేశా

- గాజువాక ప్రజలు అభిమానుల అభీష్టం మేరకే నా నిర్ణయం
- మొదటి గాజువాక ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య



గాజువాక: అభిమానులు, గాజువాక ప్రజలు అభీష్టం మేరకే తన భవిష్యత్ కార్యాచరణ నిర్ణయం ఉంటుందని గాజువాక మొదటి ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పేర్కొన్నారు. బుధవారం గాజువాకలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆయన తన భవిష్యత్ కార్యాచరణపై అభిప్రాయం వ్యక్తం చేసారు. ఈ నెల 27వ తేదీన ఆత్మీయ సమావేశంలో తను తీసుకోనున్న భవిష్యత్ కార్యాచరణపై పూర్తిగా వివరణ ఇవ్వనున్నట్లు తెలిపారు. గత ఎన్నికలలో ప్రజారాజ్యం తరపున పోటీ చేసి గాజువాక మొదటి ఎమ్మెల్యేగా ఎన్నికై సుమారు రూ. 900కోట్ల తో గాజువాకను అన్నివిధాలుగా అభివృద్ధి చేసానని తెలిపారు. అగనంపూడిలో హోలీబాబా కేన్సర్ ఆసుపత్రి, దువ్వాడ రైల్వేస్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా అభివృద్ధి, మున్సిపాల్టీగా ఉన్న గాజువాకను జీవీయంసీ లో వీలీనం వంటి అనేక కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. పల్లెటూరు వాతావరణం ఉన్న గాజువాకను అన్నివిధాలుగా అభివృద్ధి చేసామని తెలిపారు. అనివార్యకారణాల వలన గత ఎన్నికలలో పోటీ చేసే అవకాశం రాలేదని ఎమ్మెల్యేగా ఎన్నికైఉంటే మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉండేదని అన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలను కలుపుకొని తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసానని అన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి తప్పిదాలకు చోటివ్వకుండా తన సేవలందిస్తానని అన్నారు. ప్రస్తుతం గాజువాక అనేక సమస్యలతో సతమతమవుతుందని, సుమారు 5లక్షల జనాభాకు చేరుకొన్న గాజువాక అంతటి అభివృద్ధి, సంక్షేమం జరగడంలేదని అరోపించారు. తాను రాజకీయంగా పున:ప్రవేశం చేస్తున్నానని, ప్రజలు అభీష్టంమేరకే నా నిర్ణయం ఉంటుందని అన్నారు. ప్రస్తుతం అనేక పార్టీలు తనను సంప్రదిస్తున్నారని, ఆహ్వానం పలుకుతున్నారని, అయితే పార్టీ టికెట్టు వచ్చినంతమాత్రాన ఎమ్మెల్యే కాలేరని, ప్రజలు తనకు ఓటు వేసినప్పుడే ఎమ్మెల్యే గాఎన్నికఅవడం జరుగుతుందని అన్నారు. అందుకే తను నిర్వహించే ఆత్మీయ సభలో ప్రజల అభీష్టంమేరకు తన నిర్ణయం ప్రకటిస్తానని, మరోకసారి తనకు ఎమ్మెల్యేగా గాజువాక ప్రజలు అవకాశం ఇస్తారని ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో బెల్లాల సత్యానందం, యర్రా నాగేశ్వరరావు, చింతలపూడి యువసేన ప్రతినిధులు పోలీస్ నాయుడు, త్రినాధ్, శ్రీను, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### దేవుని గుడిలో దివ్వేలు

కర్షకుడా - కర్షకుడా ఏకంకండి
ఏకమై యీ దేశాన్ని పాలించండి ॥కర్ష॥
పగలనక - రాత్రనక - ఎండనక - వాననక,
కొండలు - గుట్టలు పిండిగజేసి
బీడులు గాడులు ఏకం చేసి
సాగును సేసా ఓరన్నా
నాగలి పట్టే రైతన్న ॥కర్ష॥
నీరక్తపు బిందువులే, చెమటగా మారింది
ఆవిరైపోయింది - వర్షములా కురిసింది
బీటులైన భూమిన్నైన, వాడిపోయే సెల్లన్నైన
వర్షాలు కురిసినావి, వరిసేళ్లు పండినాయి
భూమాత మనపైన కరుణించింది
ధనలక్ష్మి మన యింట వెలిసిల్లింది
పండుగలు వచ్చినాయి - బంధువులు వచ్చినారు
కొడుకులు కోడళ్లతోనూ - కూతుళ్ల అల్లుళ్లతోను
పిల్లా పాపలతోను చక్కనైన ఇల్లాలితో
హాయి హాయి గున్నావు ఓరన్నా- నీ స్వేచ్ఛకు
ఎదురులేదు రైతన్నా ॥కర్ష॥
వీధి వీధి జానపదలు - హరికథలు- బుర్రకథలు
సాములు గరిడీలు - బాజాలు భజంత్రీలు
ఇంటింటను శుభం పలుకు బసవుసి మెడలో గంటలు
ప్రకృతిమాత నిలయమైన చల్లన్నైన పల్లెటూళ్లు
దేశానికి తిండిపెట్టే త్యాగధనులు రైతన్నలు
దేశమంతా వెలుగునిచ్చే దేవుని గుడిలో దివ్వేలు
రైతన్నలు దేవుని గుడిలో దివ్వేలు ॥కర్ష॥

...కవితా రచన
కొయ్యా హరిహరరెడ్డి

## పంచాంగం

మాసం : జ్యేష్ట ; తిథి: దశమి రా.8.25; ఉత్తర రా.9.58; ఉ.వ.5.45ల 7.18.

గురువారం 24-05-2018

**మేషం** :ఊహించని సంఘటనలు జరుగును. ఆప్తిమిత్రులతో విరోధాలు, ప్రయాణాలయందు ఇక్కట్లు, ఆరోగ్యవిషయమై జాగ్రత్త అవసరం. ఔషధ సేవనం చేస్తారు. **వృషభం** : చేయి వృత్తి వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యం బాగుం డును. కొంత ఉపశాంతి కలుగుతుంది. ఆర్థిక సమస్యలు పరిష్కార మవుతాయి. లావాదేవీలు అనుకూలించును. బంధుమిత్రులతో ఇష్టాగోష్ఠి. **మిథునం** : నూతన వ్యవహారాలు లభిస్తాయి. క్లిష్ట సమస్యలనుంచి పరిష్కారం కలుగును. నూతన పరిచయాలు పెరుగును. ఆదాయం బాగుంటుంది. స్పెక్యులేషన్ అనుకూలం, తీర్థయాత్రలు చేయిదురు. **కర్కాటకం** : కట్టడాల అక్రమాల నిర్మాణంలో సమస్య లను ఎదుర్కొంటారు. నోరు అదుపులో ఉంచుకోవడం శ్రేయస్కరం. ఉత్తర ప్రత్యు త్తరాలు సంతృప్తిగా సాగుతాయి. సినిమా, విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలలో చురు కుగా పాల్గొంటారు. విందులలో పరిమితి పాటించండి. **సింహం** : కొన్ని విలువైన వస్తువులు అనుకోకుండా కొనుగోలు చేస్తారు. సతీసమేతంగా ఒక పుణ్య క్షేత్రాన్ని సందర్శిస్తారు. కళాకారులకు, రచయితలకు, పత్రికా రంగంలో వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. పాత మిత్రుల కలయిక సంతృప్తి నిస్తుంది. కొబ్బరి, పండ్లు, పూలు, చల్లని పానీయ వ్యాపారులకు లాభదాయకం. **కన్య** : బంధువుల ఆకస్మిక రాక ఇబ్బందిని కలిగిస్తుంది. ఉపాధ్యాయులు విశ్రాంతికై చేయు యత్నాలు ఫలిస్తాయి. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది. రాజకీయాలలో వారు ప్రత్యర్థుల వల్ల సమస్యలు ఎదుర్కొంటారు. **తుల** : ఎటువంటి సమస్యలనైనా ధీటుగా ఎదుర్కొంటారు. స్త్రీల వాక్ చాతుర్యంనకు, తెలివితేటలకు మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ చిన్నారుల కోసం నూతన పథకాలు వేసి జయం పొంద గలుగుతారు. **వృశ్చికం** : స్త్రీలు విందు, వినోదాలలో చురుకుగా వ్యవ హరించి పలువురిని ఆకట్టుకుంటారు. ఇతరులకు వాహనం ఇవ్వడం వల్ల ఇబ్బం దులు ఎదుర్కోక తప్పదు. సోదరీ సోదరులతో ఏకీభవించ లేకపోతారు. **ధనుస్సు** : సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టు కుంటారు. ఖర్చులు అదుపు కోకపోగా మరింత ధనవ్యయం అవుతుంది. ప్రయా ణాలలో నూతన వ్యక్తుల పరిచయం మీ కెంతో సంతృప్తినిస్తుంది. మిత్రులపై ఉంచిన నమ్మకం వమ్ము అయ్యే ఆస్కారం ఉంది. దంపతుల మధ్య అవగాహనా లోపం. **మకరం** : పెంపుడు జంతువుల గురించి ఆందోళన చెందుతారు. స్త్రీలకు అలంకరణలు, ఆభరణాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. భాగ స్వామిక వ్యాపారాల నుంచి విడిపోవాలనే ఆలోచన స్ఫురిస్తుంది. **కుంభం** : ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు తాత్కాలికమేనని గమనించి శ్రమించండి అను కున్నది సాధిస్తారు. ముఖ్యుల రాకపోకలు, ఊహించని ఖర్చులు ఎదుర్కోక తప్పదు. వివాహ, రుణ యత్నాలు అనుకూలించగలవు. **మీనం** :వ్యాపార లావాదేవీలు అనుకూలత. ఆర్థి కంగా బాగుంటుంది. పనులయందు కొన్ని ఇబ్బందు లుండును. అధికారులు వత్తిడి, శతృమూలకంగా భయాందోళన, కుటుంబ వ్యక్తులతో విరోధం,

## సాయిబాబా చిన్న కథలు



### లీలానుభూతి

వెళ్తూ ఒక జత స్వర్ణ కంకణములను సుల్తానుకు ఇచ్చి భద్ర పరచమని చెప్పారు. సుల్తాను ఏదో చెప్పబోయే లోపల వారు అదృశ్యమయ్యారు. ఐదు గంటలకు మందిరమున ప్రభాత సేవలు చేయడానికి పూజారులు వచ్చారు. మందిర కవాటములను తెరిచారు. సుల్తాను అచేతనముగా నిలబడి వున్నాడు. అతని చేతిలో మెరుస్తున్న నగను చూచి అనుమానముతో "ఏయ్! ఎవరు నీవు? నీ చేతిలో అది ఏమిటి?" అని గద్దించి అడిగారు పూజారులు. సుల్తాను "అయ్యలారా! ఇప్పుడే రాధారాణి, గోవింద మహారాజు మందిరంలోనికి వెళ్లారు. రాత్రంతా నేను వారితోనే వున్నాను. పోతూ పోతూ నాకు ఈ కంకణములను నాకిచ్చారు. ఎందుకిచ్చారో నాకు అర్థం కావడం లేదు" అన్నాడు. పూజారులకు ఏమీ అంతు చిక్కలేదు. మూసిన తలుపులు మూసినట్లే వున్నాయి. వేసిన తాళం వేసినట్లే వుంది. లోపలికి వెళ్లి పరిశోధించారు. కృష్ణ విగ్రహంలో కంకణాలు కనిపించడంలేదు.! మరొకసారి సుల్తానును చూశారు. అతడు కనులు మూసుకొని ధ్యానంలో ఉన్నాడు. ఒక వేళ అతడు దొంగ అయివుంటే ఆ కంకణాలతో అక్కడే ఉంటాడా? అని యోచించారు పూజారులు. కాదు.. కాదు.. అతడు మహాభక్తుడై వుండాలి అని నిర్ణయించి అటువంటి అనుభవమును పొందుటకు , ఈ కంకణములను సాక్షాత్తు శ్రీ కృష్ణ భగవానుని నుండి అందుకొనుటకు మీరు గొప్ప సాధకులై వుండాలి" అని ప్రశంసించారు పూజారులు.సంపూర్ణ విశ్వాసముతో భగవంతుని దర్శించాలి అని శ్రద్ధా భక్తులతో ప్రార్థించిన వారికి ఎవరికైనా భగవంతుడు అనిర్వచ నీయమైన ఆనందాను భూతిని తప్పక అనుగ్రహిస్తాడు.

### భక్తుని భారము

ఒక నాడు ఒక గోపిక బావి వద్ద రెండు కుండల నిండా నీరు నింపింది. ఒక కుండను తలపై పెట్టుకుంది. రెండవ కుండ తలపై పెట్టుకోవాలి. అంటే మరొకరి సహాయం కావాలి కదా!. అటూ ఇటూ చూసింది. కృష్ణుడు చిరునవ్వుతో వస్తూ వున్నాడు. "కృష్ణా! ఈ కుండను నా తలపై పెట్టగలవా?" అని అడిగింది. వెంటనే కృష్ణుడు "నే నా పని చేయను" అని పరుగెత్తి మాయమైపోయాడు. ఇంతలో బావి వద్దకు మరొక స్త్రీ వచ్చింది. ఆమె సహాయంతో రెండవ కుండను తలపై పెట్టుకుని ఇంటికి బయలుదేరింది గోపిక.

తలమీద రెండు కుండులతో ఇల్లు చేరింది గోపిక. కొంటె కృష్ణుడు నవ్వుతూ వాకిలి వద్ద నిలుచుని ఉన్నాడు. గబగబా వచ్చి ఆమె తల మీద ఉన్న ఒక కుండను కిందికి దింపాడు. గోపికకు ఆశ్చర్యం వేసింది. "ఏమి కృష్ణా! బావి వద్ద నా తలపై ఈ కుండను నీవు పెట్టుటకు అంగీకరించలేదు. ఇప్పుడు నేను అడగకుండానే ఈ కుండను దింపావు.

...సశేషం

## సంకీర్తన



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## భవిష్యత్ కోసం నీరు వృధా చేయరాదు

భీమునిపట్నం : నీరు వృధా కాకుండా కాపాడుకుని భవిష్యత్తు అవసరాల కోసం తాగునీటి నిక్షేపాలను కాపాడుకోటానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని నినదిస్తూ తెదేపా శ్రేణులు భీమిలిలో భారీ ఊరేగింపు నిర్వహించాయి.ఈనాడు-ఈటీవీ అందించిన సుజలాం...సుఫలాం కార్యక్రమంలో భాగంగా భీమిలి డివిజన్ తెదేపా అధ్యక్షుడు గంటా నూకరాజు, గాడు సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో భీమిలి పాతబస్టాండ్ నుంచి గంట స్థంభం వరకు పలు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. వర్షపునీరు భూమిలోకి ఇంకే విధంగా ఎవరికి వారే తమ వంతు కృషి చేయాలని అన్నారు. వాడుకనీరు వృధా కాకుండా ఇళ్లలో ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి డివిజన్ తెదెపా ఉపాధ్యక్షుడు పి.యోగేశ్వరావు, నూకలమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కాసరపు.నాగరాజు,గిడుతూరి శ్రీనివాసరావు, దాసరి వెంకటేష్, సూర్యనారాయణ మాస్టారు, కనకల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ ప్రారంభం



శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

నర్సీపట్నం : నర్సీపట్నం ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం పశుసంవదర్ధశాఖ, వెలుగు ఆధ్వర్యంలో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు మూడు రోజుల పశుసఖి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా చెట్టు పల్లి పశువైద్యాధికారి అనూష గ్రామాల్లో ఉండే పశువులను ఏ విధంగా సంరక్షించాలి, పశువుల దాన అవసరమగు పచ్చిమేత ఏ విధంగా సాగు చేయాలి, వాటిని పశువులకు ఏ విధంగా అంద జేయాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. నర్సీపట్నం మండలంలోని సీఆర్పీలుగా నియమించిన 8 మందికి గౌరవ వేతంగా వెలుగుశాఖ నుండి నెలకు రూ.3వేల చొప్పున సంవత్సరంపాటు ఇవ్వ ేం జరుగు తుందన్నారు.

ఈ కార్యక్రమంలో వేములపూడి వైద్యాధికారి ఎల్.ప్రదీప్‌కుమార్, నర్సీపట్నం వెలుగు ఏపిఎం సత్తిబాబు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా ఇవ్వాలని నిరాహారదీక్ష



నిరాహారదీక్షలు చేపడుతున్న దశ్యం

నర్సీపట్నం : ప్రత్యేక హోదా సాధన సమితి నర్సీపట్నం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సాధన సమితి కన్వీనర్ డి.సత్తిబాబు మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 23 నుండి 25వ తేదీ వరకు నిరాహారదీక్షలు కొనసాగిస్తామన్నారు. రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించిన బిజెపి ప్రభుత్వం విభజన సందర్భంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆయన విమర్శించారు. ప్రత్యేక హోదా ఇచ్చి రాష్ట్రానికి న్యాయంచేస్తామని తెలిపి బిజెపి ప్రభుత్వం మోసాన్ని బుట్టబయలు చేయాలన్నారు. ఈ దీక్షలో రైతు సంఘం జిల్లా నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ప్రత్యేక హోదా సమన్వయకర్త తవ్వా చిరంజీవి మధ్యాహ్న భోజన పథకం జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న రాజేశ్వరి, జెవివి రాష్ట్ర నాయకులు త్రిమూర్తుల రెడ్డి, పౌర సంక్షేమ సంఘం నాయకులు జోగినాయుడు పాల్గొన్నారు.

# అంకితభావంతో పేదలకు వైద్య సేవలు

**- కుటుంబ ఆర్థికాభివృద్ధి ఆరోగ్యం దోహదం**   **- జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్**





విజయనగరం : కుటుంబ ఆర్థికాభివృద్ధికి ఆరోగ్యం దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో డిపిహెచ్‌ఎస్ అధ్యక్షతన జరిగిన 2017-18 కాయకల్ప అవార్డుల ప్రధానానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఆసుపత్రులు కాయకల్ప అవార్డులు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. పేదలకు అంకితభావంతో వైద్యసేవలు అందించాలని సూచించారు. కుటుంబం అనారోగ్యం పడితే ఆర్థికంగా చాలా నష్టపోతారని చెప్పారు. ఆసుపత్రుల అభివృద్ధికి వ్యక్తిగత అభిప్రాయాలతో పాటు బయట వ్యక్తుల సలహాలు, సూచనలు పరిగణలోనికి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది బృందంగా ఏర్పడి సేవలందిస్తే మంచి ఫలితాలుసాధించవచ్చన్నారు. ఆసుపత్రులలో మెరుగైన పారిశుధ్యం, పరిశుభ్రత పాటిస్తే అవార్డులు సొంతం చేసుకోవచ్చన్నారు. జిల్లాలో అంకితభావంతో పనిచేసే డాక్టర్లు ఉన్నారని మరెన్నో అవార్డులు సాధించా లని ఆకాంక్షించారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తానని చెప్పారు.

**మునివంపుల టు ముస్సోరి :**

మునివంపుల గ్రామంలోముందుగా ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధుల్లో చేరానన్నారు. ఒక పడక పిహెచ్‌సి ప్రారంభించి 30 పడకల ప్రాధమిక ఆరోగ్య కేంద్రంగా అభివృద్ధి చేసానని చెప్పారు. మునివంపుల గ్రామంలో వైద్యాధికారిగా పనిచేస్తూ ఐఎఎస్‌కు ఎంపికై ముస్సోరిలో శిక్షణ పొందానన్నారు. వైద్యాధికారిగా సంతృప్తికరమైన సేవలు అందించానన్నారు. ముందుగా జిల్లా జిల్లా ఆసుపత్రిలో పర్యటించారు. ఓపి విభాగం, ఔషదం విభాగం, మానసిక వ్యాధుల విభాగం, అత్యవసర వార్డుల్లో పర్యటించి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరాతీశారు. ఎస్.కోట గ్రామానికి చెందిన బోనిగంగ తీవ్రమైన రక్తహీనతతో బాధపడుతుందని కోలుకున్నాక తనను కలవాలని గంగ సోదరుడు అప్పారావుకు సూచించారు. అత్యవసర సమయంలో విజయనగరం నుండి 108 వాహనంలో రోగులను విశాఖపట్నం తరలించడానికి అనుమతించాలని ఆసుపత్రి వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా సానుకూలంగా స్పందించారు.

**అవార్డులు పొందిన ఆసుపత్రులు :**

2017-18 సంవత్సరానికి సంబంధించి ఎస్.కోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పూసపాటిరేగ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం, పట్టణంలోని పూల్‌బాగ్ యుపిహెచ్‌సిలు ఉత్తమ ఆసుపత్రులు అవార్డులు సొంతం చేసుకున్నాయి.

భోగాపురం, నెల్లిమర్ల సిహెచ్ సిలు, రామభద్రాపురం, గరివిడి, అలమండ పిహెచ్‌సిలు, లంకాపట్నం, వి.టి.అగ్రహారం యుపిహెచ్‌సిలకు కమిండేషన్ సర్టిఫికేట్లు సొంతం చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సీతారామరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.వి.వెంకటరావు, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

## హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై కరపత్రాలు పంపిణీ



కరపత్రాలను అందజేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : జిల్లా ఎయడ్స్, నివారణ సంస్థ ఆదేశాల మేరకు నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామంలో బుధవారం జరిగే సంతలో స్టాల్ ఏర్పాటు చేసిన గ్రామస్థులకు, యువకులకు సుఖవ్యాధులు, టిబి, హెచ్‌ఐవి, ఎయిడ్స్ సంబంధించిన కరపత్రాలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో సిఎల్‌డబ్ల్యూలు ఝాన్సీ, క్రాంతి పై వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వేములపూడి మాజీ సర్పంచ్ బోళెం నర్సింహమూర్తి, గ్రామ సెక్రటరీ బి.ఎ.నివాస్, ఏఎన్‌ఎం కె.వజ్రం, నర్సీ పట్నం మండల ఎస్‌ఐ కెఎస్.రావు పాల్గొన్నారు.

## వదంతులకు భయపడవద్దు : ఎస్సై సత్యనారాయణ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నాతవరం ఎస్సై సత్యనారాయణ

నాతవరం : పార్థిగ్యాంగ్ అని, పిల్లలను ఎత్తుకొని పోయే గ్యాంగ్ అని రకరకాలుగా వదంతులు సృష్టిస్తూ కొంత మంది అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని నాతవరం ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు. బుధవారం నాతవరం మండలం పెదగొలు గొండపేటలో అవగాహన కల్పించారు. అనవసర వదంతులు వ్యాప్తి చేసే వారిపై ఐటి యాక్టు ప్రకారం కేసులు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. కావున బాధ్యత గల ప్రజలందరూ విషయాన్ని గమనించి ఎటువంటి అపోహలకు పోవద్దన్నారు.

గ్రామాల్లో కొత్త వ్యక్తులు, మతిస్థిమితం లేని వారు కనిపిస్తే వారిపై దాడి చేయవద్దన్నారు. అనుమానితులు సంచరిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

# పాపాహోంలో ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



విశాఖపట్నం : సూర్యాబాగ్ దరి పోలీస్ బ్యారెక్స్‌లో గల పబ్లిక్ & పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ పాపాహోం ప్రాంగణంలో పాపాహోం బాలల కోసం నిర్వహించిన 21 రోజుల వేసవి శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. ఈ వేసవి శిక్షణ శిబిరంలో పాపాహోం బాలలు పాల్గొని కొవ్వొత్తులల తయారీ, ఫినాయిల్ తయారీ, పోలీస్ డ్రిల్, భగవద్గీత, కంప్యూటర్ ట్రైనింగ్, క్రికెట్ కోచింగ్‌వంటి వివిధ అంశాలపై శిక్షణ పొంది ఆ అంశాలను ముఖ్య అతిథికి వివరించారు. ఈ వేసవి శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లా & ఆర్డర్, పాపాహోం వైస్ చైర్మన్ కె.పక్కీరప్ప హాజరైనారు. అనంతరం ఆయన పాపాహోం బాలలను ఉద్దేశించి ప్రసంగిస్తూ వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న ప్రతి అంశంపై విద్యార్థులు చక్కని అవగాహన కలిగి వుండాలన్నారు. బాగా చదువుకొని భవిష్యత్తులో విద్యార్థులైన మీరంతా జ్ఞానవంతులుగా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం పాపాహోం బాలల కోసం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను మరియు సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. సంస్థ అధ్యక్షులు పి.సత్యన్నారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాపాహోం బాలలకోసం విభిన్న అంశాలపైన వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించి వారిలో గల ప్రతిభాపాటవాలను వెలికి తీస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతోనే పాపాహోం దిగ్విజయంగా నడుస్తుందని తెలియజేసి ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొని విభిన్న అంశాలపైన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన గురువులు బి.శంకరరావు, ఎ.ఆర్. హెచ్.సి గౌరి ప్రసాద్, ఆర్.ఐ శ్రీకుమార్, వై.కృష్ణమూర్తి, కె.ప్రభాకరరావు, ఎం.సాయికుమార్‌లను ఘనంగా సత్కరించి విద్యార్థులను అభినందిం చడమైనది. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, పాపాహోం కార్యవర్గసభ్యులు డి.సూర్యప్రకాశరావు, ఆర్.సి.జైన్, వి. రాజ్యలక్ష్మి, పాపాహోం మీడియా ఇన్‌చార్జి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, పాపాహోం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న బీమా సొమ్ము అందజేత



బీమా సొమ్ము అందజేస్తున్న దఅశ్యం

గొలుగొండ : మండలంలో కొత్త ఎల్లవరం గ్రామంలో బుధవారం ఇటీవల మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాలకు తక్షణ సాయాన్ని వెలుగు అధికారులు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్టీరింగ్ కమిటీ సభ్యులు కొల్లు రాంబాబు చేతుల మీదుగా అందించారు. గ్రామా నికి చెందిన పెట్ల రత్నం, శెట్టి రమణమ్మ ఇటీ వల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం కింద ఐదు వేల రూపాయల చొప్పున అందజేయడం జరిగింది. ఈ సంద ర్భంగా రాంబాబు మాట్లాడుతూ చంద్రన్న బీమా వలన ఎంతో ఆసరాగా కల్పిస్తుం దన్నారు. ప్రతీ ఒక్కరూ చంద్రన్న బీమాలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జల్లు కొండమ్మ ఎంపిటిసి శెట్టి వరహాలమ్మ, శెట్టి గణేష్. వెలుగు బీమా మిత్ర వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## బిసి కార్పొరేషన్ ఋణములు కోసం అన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

భీమునిపట్నం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు గ్రామీణ /పట్టణ పేద ఉత్పాదకత మెరుగు పరచడం ద్వారా అదనపు ఆదాయాన్ని సృష్టిం చడం మరిఆధునిక పథకముల వినియోగానికి తీసుకొని రావడం ద్వారా బి.సి.లబ్దిదారులకు ఆదరాణ 2 పదకం ను మార్చి నెల పది హేను న ముఖ్యమంత్రి ప్రారంభించారు. విశాఖ పట్నం జిల్లా ఏదైనా మునిసిపాలిటీ / మండలం లో స్థిర నివాసం కలిగి ఉన్న బి.సి.కులమునకు చెందిన వారై కుల వృతి మరియు చేతి వృత్తి దారులు అందరూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశముల ప్రకారం 2018-2019 సంవత్సరం కు గాను 21 సం.ల నుండి 50సం మధ్య వయసు కలిగి ఉండాలి, బి.సి.జాభితాలో ఏదైనా ఉపకులము కు చెందినట్లు ఈ సేవా ద్వారా కుల దృవీకరణ పత్రంను పొందవలెను.

రాష్ట్రంలోని బిసీ, కార్పొ రేషన్ పదకముల క్రింద ఋణములు మంజూరు చేయబడుచున్నవి సదరు ఋణములు లబ్ధి పొందుటకు గాను ఆశక్తి కలిగిన లబ్ధిదారులు ఋణములు పొందు నిమిత్తం మీ యొక్క ఆదార్ కార్డ్, తెలుపు రేషన్ కార్డ్,కుల ధ్రువపత్రం తీసుకొని అన్ లైన్ ద్వారా(www.adarana. ap. gov.in) అనే వెబ్ సైట్ లో దరఖాస్తు చేసు కోవాలని బి,సన్యాసినాయుడు కోరారు .

## ధృవీకరణ పత్రాలు పంపిణీ

భీమునిపట్నం : చిప్పాడలోని దివిస్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో సూయింగు మిషన్ ఆపరేటర్లులుగా శిక్షణ పొందిన 30 మంది మహిళలకు రెండో సంయుక్త కలెక్టరు డాక్టర్ ఎ.సిరి మంగళవారం ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఇందులో 26 మందికి వాల్టా ఫ్యాషన్స్, ముత్యాల గార్మెంట్స్ దుస్తుల తయారీ కంపెనీల్లో ప్లేస్ మెంట్స్ లభించాయి. వీరికి ఉద్యోగ నియామక పత్రాలను జేసీ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల స్వయం పాధికీ, ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్న దివీస్ యాజ మాన్యాన్ని ప్రశంసించారు. దివీస్ డైరెక్టర్ మధుసూదనరావు దివి,డీజీఎం వైఎస్ కోటీశ్వరరావు,సీఎస్ఆర్ అధికారులు సురేష్ కుమార్ దేవల్ల,ఇ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు నష్టం కలిగించేలా ఉన్నాయి

భీమునిపట్నం : చిట్టివలస జ్యూట్ మిల్లు సమస్యపై ఉపముఖ్యమంత్రి సమక్షంలో నగరంలోని గవర్నర్ బంగ్లాలో తీసుకున్న నిర్ణయాలు కార్మికులకు నష్టం కలిగించేలా ఉన్నాయని కార్మిక జేఏసీ అధ్యక్షులు కంటుభుక్త రామానాయుడు ఆరోపించారు. తగరపువలసలో జరిగిన సమావేశంలో జేఏసీ సభ్యులు,మిల్లు సీనియరు కార్మికులతో కలసి మాట్లాడారు. వేతన చెల్లింపు చట్టం-1936ను విస్మరించి జరిపిన చర్చల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. కార్మికులకు పూర్తి స్థాయిలో న్యాయం చేసేలా నెల రోజుల్లోగా సమ స్యను పరిష్కరించాలని లేకుంటే కార్మికులకు అండగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామనీ తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# భవనాల కూల్చివేత పనులు

యానాం : ప్రభుత్వ ఆరోగ్యశాఖలో పనిచేసే ఉద్యోగుల కోసం నిర్మించిన నర్సు క్వార్టర్సు భవనాల సముదాయం కూల్చివేత పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి యానాం తో పాటు చుట్టుప్రక్కల నియోజకవర్గాలకు చెందిన వేలాది మంది ప్రజలు వైద సేవల కోసం జిప్‌మేర్ యూనిట్ నిర్మాణం చేపట్టనున్న విషయం తెలిసిందే.

రూ. 20 కోట్లతో నర్సు క్వార్టర్సు ప్రాంగణంలో జిప్‌మేర్ అడ్మినీస్ట్రేషన్ నిర్మాణానికి ఈ కూల్చివేత పనులు చేపట్టారు. ఒక ఏడాదిలోగా భవన సముదాయం నిర్మాణం పూర్తిచేసే లక్ష్యంలో భాగంగా ప్రస్తుతం పాత, కొత్త భవనాలు కూల్చివేస్తున్నారు. కూల్చివేత అనంతరం మెటేరియల్ బయటకు తీసుకు పోయే విధంగా కాంట్రాక్టర్లు చర్యలు చేపట్టారు. గతంలో ఉద్యోగల నివాసానికి నిర్మించిన పాత భవనాలు, నాలుగు పక్కల పిల్లర్లు మినహా మిగతా ప్రాంతంలో పిల్లర్లు లేకుండా భవనాన్ని నిర్మించిన ఘటనలు ఈ కూల్చివేతలో బయట పడ్డాయి గతంలో అప్పటి అధికార్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయి భవనాల్ని నిర్మించినట్లు ఈ కూల్చివేతలో బయటపాడ్డాయి. గ్రౌండ్‌ఫ్లోర్, పైఫోర్లు నిర్మాణాలు చేపట్టినప్పటికీ క్రింద పునాది సరిగా చేపట్టక్కపోవడం ఆశ్చర్యానికి గురిచేసాయి.

## ఓటరు జాబితాపై ఇంటింటా సర్వే ఏర్పాట్లు

ఆలమూరు : ఓటరు జాబితాపై మండలంలో ఇంటింటా సర్వే చేపట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తహశీల్దార్ కె.పద్మావతి తెలిపారు. చీఫ్ ఎలక్షన్ కమీషనర్ ఆదేశాలు మేరకు ఓటరు జాబితాలో పేర్లు నమోదు, తొలగింపు, సవరణలు తదితర అంశాలపై మండలంలోని గ్రామాలలో బూత్ లెవిల్ అధికార్లు సర్వే చేపట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజలు ఓటరు జాబితాలో తమ పేరు వున్నదీ, లేనిదీ సరిచూసుకోవడం, అలాగే తప్పు, ఒప్పులు వున్నచో సరిచేసుకోవడానికి తగిన దర ఖాస్తులు విఆర్వోలకు అందజేయడానికి సహకరించి, మీ ఓటు హక్కును వినియోగించు కోవలసినదిగా ఆమె ప్రజలకు సూచించారు.

# బెయిలీ వంతెనకు శంఖుస్థాపన చేసిన ఎమ్మెల్యే చిర్ల



రావులపాలెం : మండల పరిధి గోపాలపురం కొత్త కాలనీలో బుధవారం శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి బెయిలీ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ ఆనే లక్ష్మి ముసలయ్య ఆధ్వర్యంలో జరిగిన బెయిలీ వంతెన నిర్మాణ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి హాజరై మాట్లాడుతూ గోపాలపురం కొత్తకాలనీ వాసులు ఎన్నో ఏళ్ళుగా ఆశగా ఎదురు చూస్తున్న కల నెరవేరబోతోందని రానున్న రోజుల్లో వంతెన నిర్మా ణంతో గ్రామ ముఖ్య కూడలికి చేరువయ్యే అవకాశాలు ఉంటా యని, వంతెన నిర్మాణంతో ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగిం చుకునేందుకు, అధికారుల కార్యాలయాలకు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిపి కోట చెల్లయ్య, జిల్లా పరిషత్ ప్రతిపక నేత సాకా ప్రసన్న కుమార్, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇన్‌చార్జి ఆకుల రామకృష్ణ , టి.యన్. టి.యు.సి జిల్లా నాయ కులు మైగాపుల గురవయ్య నాయుడు, చిర్ల రాము, ఉప సర్పంచ్ అధికారి నాగు, వార్డు సభ్యులు గుడిమెట్ల శారద, దొమ్మేటి అర్జనరావు అధిక సంఖ్యలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ ఉద్యోగుల సమ్మెకు సిపిఎం పార్టీ మద్ధతు

విశాఖపట్నం : పోస్టల్ ఉద్యోగులు తమకు వేతన సవరణ చేయాలని, దానికి సంబంధించిన కమలేష్ చంద్ర కమిటీ 7వ వేతన కమీషన్ సిఫార్సులలోని సానుకూల అంశాలను అమలు చేయాలని కోరుతూ సమ్మె చేస్తున్న పోస్టల్ ఉద్యోగుల సమ్మెకు సిపిఎం విశాఖ జిల్లా కమిటీ సంపూర్ణ మద్ధతు తెలియజేస్తుంది. కమిటీ సానుకూల సిఫార్సులను ఆమోదించకుండా మోడీ ప్రభుత్వం తాత్సారం చేయటాన్ని సిపిఎం ఖండిస్తోంది. వేతన సవరణను ఆమోదించ పోగా ఇప్పటికే జిడిఎస్ ఉద్యోగులకు ఉన్న హక్కు లను బిజెపి ప్రభుత్వం కాలరాసే ప్రయత్నం చేస్తున్నది. జిడిఎస్ ఉద్యోగులకు మద్దతుగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు కూడా సమ్మెలో పాల్గొనటాన్ని సిపిఎం అభినందిస్తున్నది. జిడిఎస్ ఉద్యోగులకేగాకుండా మోడీ ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు, బ్యాంక్ ఉద్యోగు లకు కూడా వేతన సవరణను నిరాకరిస్తోంది.

కార్మిక చట్టాలలో మార్పులు చేసి దశాబ్ధాల తరబడి కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎత్తివేస్తున్నాయి. మోడీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను పెద్ద ఎత్తున ప్రయివేటీకరిస్తున్నది. పోస్టల్ డిపార్ట్‌ట్ మెంట్‌ను కూడా కార్పొరేటీకరణ చేయాలని చూస్తోంది. దీనికి ప్రభుత్వరంగ ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలి. పోస్టల్ (జిడిఎస్) ఉద్యోగు లను కేంద్ర ప్రభుత్వం బానిసలుగా చూస్తోంది. పర్మనెంట్ పనులు చేయించుకుంటూ సరైన వేతనాలు, అలవెన్సులు లేకుండా దోపిడీ చేస్తోంది. జిడిఎస్ ఉద్యోగులకు సరైన వేతనాలు లేక పోవటమేకాదు, పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పదవీవిరమణ సదుపాయాలు కూడా లేవు. రాజ్యాంగబద్ధంగా ఇవ్వాల్సిన సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం గొడ్డిచాకరి చేయించుకోవడం అన్యాయం. ఇప్పటికే పోస్టల్ ఉద్యోగులు సమ్మెలో వుండడంతో ఉపాధి కూలీలకు రావల్సిన బకాయిలు స్థంబించాయి.

## తపాలా కార్మికుల నిరవాధిక సమ్మె

యానాం: దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామీణ తపాలా కార్మికులకు జిబిఎస్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మెలో యానాం పరిసర ప్రాంతాలకు చెందిన పోస్టల సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక డాక్టర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న పాత పోస్టాఫీసు ఎదుట సమ్మె నిర్వహించారు. నూతన వేతన విధానాలు, నిబంధనలు అమలుచేయాలని జిబిఎస్ కమిటీ ఇచ్చిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అనేక నెలలుగా అమలుచేయకపోడాన్ని నిరసిస్తు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేశారు. డిపార్టుమెంట్ వారితో సమంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కార్య దర్శి ఎం. బుల్లియ్య, జి సుబ్బాంరావు, సిహెచ్‌వి సుబ్రమణ్యం, కె.శారదాదేవి, ఆర్. శ్రీనివాసరావు, డి. మల్లి, కె. జగన్మోహన్, ఎం. సత్యనారాయణ, ఎస్ వెంకన్న, కె. నాగేశ్వరరావు, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రోత్సాహక పథకం నిధులు విడుదల

తాళ్లరేవు : మండలంలోని ఈ-మల్లవరం గ్రామానికి చెందిన విద్యార్థులకు 2017 నుండి 2019 వరకు రావలసిన నిధులు రూ. 25.80లక్షల నిధులు విడుదల అయినట్టు ముమ్మడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. కాకినాడ కార్పొరేట్ కళాశాలలో వీరంతా ఇంటర్మిడియట్ చదువుతున్నారని. 60 మంది విద్యార్థులకు సంబంధించి జిఎస్‌పిసి సంస్థ ప్రత్సోహక పథకం ద్వారా రావలసిన నిధులు రెండేళ్ళ నుండి నిలిచిపోయాన్నారు. దీనిపై చమురు సంస్థల ప్రతినిధులతో అనేకసార్లు అమలా పురం ఎంపి పి. రవింద్రబాబు చర్చించారన్నారు. అనంతరం ఒఎన్‌జిసి చైర్మన్ శశిశంకర్ రూ. 25.80 లక్షల నిధులు విడుదలచేశారాన్నరు. ఎంపి. ఎమ్మెల్యేకు ఈ-మల్లంవరం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## 29న కౌలు రైతుల ఋణమేళా

ఆలమూరు : ఈ నెల 29న స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో కౌలు కార్డులు పొందిన రైతులకు ఋణమేళా నిర్వహించుచున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.వి.ఎన్.రమేష్ కుమార్ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఋణాలు తీసుకోవలసియున్నందున గత ఏడాది కౌలు రైతు ఋణ అర్హత కార్డులు సాగు ధృవీకరణ పత్రాలు తీసుకోలేని వాటిని పునరుద్ధరించేకునేందుకు గడువు ముగిసేలోపు రెవిన్యూశాఖ అధికారుల వద్దకు వెళ్లి రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మండలంలో వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొనే 29న ఋణమేళా కార్యక్రమంలో రైతులందరూ పాల్గొని ఋణాలను పొందాలని ఆయన సూచించారు.

## ఋణ అర్హత కార్డులపై కౌలు రైతులకు అవగాహన సదస్సు

ఆలమూరు : ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతులు ఋణాలు తీసుకునేందుకు ఋణ అర్హత కార్డులను సత్వరమే రెన్యువల్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.వి.ఎన్. రమేష్ కుమార్ తెలిపారు. మండల పరిధి చొప్పెల్ల పంచాయితీ కార్యాలయం వద్ద బుధవారం ఆయన కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఋణ అర్హత కార్డులను రెన్యువల్ చేసకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చొప్పెల్ల నీటి సంఘం అధ్యక్షులు మెర్ల గోపాలస్వామి, ఎంపిఈఓ మనోహర్, రైతులు పాల్గొన్నారు.

## నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళము



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి రత్నగిరి కొండపై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి తూ.గో.జిల్లా గొల్లప్రోలు గ్రామానికి చెందినపాముల.సూర్యారావు గావు ప్రతీనెల ఆగష్టు 13వ తేదీన అన్నదానం జరిపించవలసిందిగా దేవస్థానం పిఆర్వో తులా.రాముడుకు రూ.లక్ష విరాళము అందజేశారు.

### దాహంతీర్చడం సామాజిక బాధ్యత

# 'ఉమర్‌ఆలీషా' సేవలు ప్రశంసనీయం



కాకినాడ: సృష్టిలో ప్రతి ప్రాణికి ప్రాణ వాయువుతో పాటు ,ప్రాణాలు కాపాడే నీరు కూడా ఎంతో అవసరమని పలువురు పేర్కొం టున్నారు. ఉమర్ ఆలీషా విశ్వవిజ్ఞాన, విద్యా, ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో కాకినాడ బోటు క్లబ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్న సందర్భంగా పలు వురు స్పందిస్తూ పశుపక్ష్యాదులకు ప్రత్యేకంగా చలివేంద్రాలు నిర్వహించడం ఎంతో ప్రశంస నీయమన్నారు. ప్రతీ ఏడాది 60రోజలపాటు ఇటు వంటి సేవాకార్యక్రమాలు ఉమర్ ఆలీషా పీఠం తరుపున ప్రతీనగరంలోనూ,ప్రతీ ప్రాంతం లోనూ నిర్వహించడం జరుగుతుందని తాత్విక బాలవికాస్ కన్వీనర్ మరిసే నాగేశ్వరరావు తెలిపారు. పీఠం సభ్యులు పేరూరి బాజ్జి ,బాదం లక్ష్మీ కుమారి,పెంకే నాగేశ్వరరావు, మేడిశెట్టి లక్ష్మి ,సాయి శుబాష్,రెడ్డి సూర్యప్రభావతి తదితరులు మజ్జిగ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

# ప్రత్యేకత ఉంటేనే ప్రగతి సాధ్యం

### జిల్లా ఉపవిద్యాశాఖాధికారి వివి రమణ




విశాఖపట్నం : ఏ రంగంలోనైన ప్రత్యేకత ఉంటేనే ప్రగతి సాధ్యమవుతుందని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి (పాడేరు) వివివి. రమణ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఎస్ స్కూల్, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్సుల ఆధ్వర్యంలో నెలరోజులు పాటు జరిగిన వేసవి నృత్య శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రమణ మాట్లాడు తూ జాతీయ అంతర్జాతీయ స్థాయి సాంప్రదాయ నృత్యాలను ఎంపిక చేసుకుని బాలలకు శిక్షణ ఇవ్వడం ఆనందదాయకమన్నారు. బహుభాషా నృత్యాల్లో స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ విశ్వ ఖ్యాతిని అర్జిస్తున్నదని కొరియోగ్రాఫర్ నీగరాజ్ పట్నాయక్‌ను అభినందించారు. ఉడా చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్ హరిప్రసాద్ మాట్లాడుతూ దేశ, విదేశాలో& అనేకమంది వృత్తి కంటే ప్రవృత్తితోనే అసాధారణ ప్రగతిని సాధిస్తున్నారన్నారు. ఎస్ఎఫ్ ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్‌ఫాదర్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ సృజనాత్మకతకు పెద్దపీట వేస్తున్నా మన్నారు.

ఈ కార్యక్రమంలో కొరియోగ్రాఫర్ ఆర్ఎ. నాగరాజ్ పట్నాయక్, విజెఎఫ్ కార్యదర్శి ఎస్ దుర్గా రావు, డాన్స్‌మాస్టర్ పి. శివకుమార్‌లు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యఅతిధి నృత్య శిక్షణ అభ్యసించిన చిన్నారులకు ప్రసంశా పత్రాలను అందించారు. అనంతరం బాలలు బంగ్లాదేశ్, అంధ్రా జానపద నృత్యాలను ప్రదర్శించారు.

# వైఎస్ఆర్సిపి మండల బూత్ కమిటీ అవగాహన సదస్స



కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మండల కేంద్రమైన కొత్తపల్లిలో బూత్ కమిటీ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు ఈ అవగాహన సదస్సులో పిఠాపురం కోఆర్డినేటర్ పెండెం దొర బాబు మండలంలో బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ కిందిస్థాయి నుంచి ప్రతి ఒక్కరు జగనన్న చేస్తున్న రాజన్న రాజ్యం కోసం జగనన్న ప్రజాసంకల్పయాత్ర మండుటెండలో తండ్రి ఆశయాల కోసం కష్టపడుతున్నారని అదేవిధంగా ప్రతి ఒక్కరు కింద స్థాయి కార్యకర్త నుంచి వైసిపి బలం చూపించాలని ప్రతి ఒక్కరికి అవగాహన కలిగేలా ప్రతి ఒక కార్యకర్త తెలియజెప్పాలని జగన్ సీఎం అయ్యే వరకు కష్టపడాలని కిందిస్థాయి కార్యకర్తలను గుర్తించే పార్టీ వైసిపి అని పేర్కొన్నారు మండల వైసిపి అధ్యక్షులు అనల సుదర్శన్ మాట్లాడుతూ మండలంలో వైసిపి బలంగా ఉందని కింద స్థాయి కార్యకర్తలు కష్టపడి పనిచేస్తున్నారని దానికి నిదర్శనం జగన్ చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు రెండు వేల కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా పెండెం దొరబాబు మద్దతు పలుకుతూ మొన్న జరిగిన పాదయాత్ర నిదర్శనమన్నారు పెండెం దొరబాబు ఎమ్మెల్యే అయ్యేవరకు, జగన్ సీఎం అయ్యే వరకు పోరాడుతామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి దొరబాబు, మండల అధ్యక్షులు అనల సుదర్శన్, కారే శీను, తదితరులు పాల్గొన్నారు

# నష్టం కలిగించే ఫ్యాక్టరీ నిర్మాణం ఆపాలి





కొత్తపల్లి: కొత్తపల్లి మండలం అమీనాబాద్ గ్రామంలో అనధికారికంగా కట్టడాలను ఆపివేయాలని గ్రామస్తులు పంచాయతీ వారికి పత్రాన్ని అందజేశారు. వివరాల్లోకెళ్తే అమినాబాద్ గ్రామం రోడ్డు సమీపంలో గండేపల్లి సుబ్బారావు, గండేపల్లి లక్ష్మణరావు వీరి స్థలంలో రొయ్యల ఫ్యాక్టరీని నిర్మిస్తున్నారని తెలియడంతో ఆ నిర్మాణ కార్యక్రమం తక్షణమే ఆపాలంటూ స్థానికులు పంచాయతీకి వినతిపత్రం అందజేశారు ఈ నిర్మాణం వల్ల అనారోగ్యం దుర్వాసన వచ్చి అనకుండా బతుకు జీవించడం కష్టమని స్థానికులు తెలియజేశారు అంతేకాకుండా ఈ ఫ్యాక్టరీకి పంచాయతీ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం.చిన్ని బుధవారం ఉదయం నోటీసు జారీ చేశారు. నిర్మాణం పనులు ఆపక పోయినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. గతంలో 3 నెలల క్రితం రమణ పాలెం గ్రామంలో సేఫ్ సీ ఫుడ్ ఇది గతంలో ఐస్ ఫ్యాక్టరీ గా మొదలుపెట్టి ప్రస్తుతం రొయ్యల తలకాయలు తీసే ఫ్యాక్టరీగా పనిచేస్తున్నారు. 3 నెలల క్రితం రామన్నపాలెం గ్రామస్థులు ఈ ఫ్యాక్టరీని మూసివేయా లంటూ ఆందోళన చేపట్టారు ఈ ఫ్యాక్టరీ వల్ల చర్మవ్యాధులు దుర్వాసన వస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామంకొత్త మూలపేట గ్రామంలో ఎస్సీ ఈ జెడ్ ఎదురుగా ఇలాంటి ఫ్యాక్టరీనే మరొకటి నిర్మాణ కార్యక్రమం జరుగుతుండగా ఎస్ ఈ జడ్ వాసులు ఆందోళన చేసిన ఫ్యాక్టరీ నిర్మాణం మాత్రం జరుగుతూనే ఉంది. అమినాబాద్ గ్రామం నుండి కొత్త మూలపేట ఎస్సీ జెడ్ వరకు సుమారు నాలుగు ఫ్యాక్టరీలు నిర్మాణంలో ఉన్నాయి ఈ ఫ్యాక్టరీ నిర్మాణాలు జరిగి సముద్రం వెంబడి పని మొదలుపెట్టిన తర్వాత స్థానికులకు చర్మవ్యాధులు దుర్వాసన ఆ ఫ్యాక్టరీలు వదిలే కలుషితమైన నీటిని ఈ రోడ్డుకు ఆనుకునే ఉన్న పెద్ద ఏరులో నీటిని వదలడం వల్ల మత్యకారులకు మత్స్య సంపద నష్టం.

గతంలో రావు చిన్నారావు ఈ ఫ్యాక్టరీలుపై ఈ ఫ్యాక్టరీల వల్ల వదిలే కలుషిత నీరు వల్ల వైరస్ వచ్చి రొయ్యల చెరువులకు తీవ్ర నష్టం కలుగుతుందని దిగుబడి తగ్గి నష్టపోతున్నామని ఇది ఒక రైతు నష్టమే కాదని మత్స్య సంపద కూడా నష్టమేనని ఈ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యే పూర్తిగా పని చేయడం మొదలుపెడితే మత్స్య సంపద కనుమరుగైపోతాయి అదేవిధంగా సముద్రం ఎంబడి చర్మవ్యాధులు మిగులుతాయని ఈ ఫ్యాక్టరీల వల్ల స్థానికులకు, ప్రకృతికి నష్టం మిగులుతుందని పేర్కొన్నారు.

## రావులపాలెంలో సిపిఐ విస్తృత స్థాయి సమావేశం

రావులపాలెం : రావులపాలెం లో భారత కమ్యూనిష్టు పార్టీ విస్త ృత స్థాయి సమావేశం అధ్యక్షులు కర్రి రామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు నల్లా భ్రమరాంబ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడు తూ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, ప్రజా సమస్యలపై ప్రజా సంఘాలతో కలసి పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్వ హించే శిక్షణా తరగతులకు నియోజక వర్గం నుండి 10 మంది పాల్గొనేందుకు నిర్ణ యించారు. ఆలమూరు, కొత్తపేట, సిపిఐ కమిటీ సభ్యులు హాజరయ్యారు. కె. రామకృష్ణ, గొలుగూరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఆర్‌సి చలివేంద్రానికి 5వేలు విరాళం

రావులపాలెం : సిఆర్‌సి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న చలివేంద్రానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. పాదచారులు, వాహన చోదకులు వడదెబ్బకు గురి కాకుండా స్థానిక పోలీస్ స్టేషన్ ప్రక్కన నేషనల్ హైవే ప్రక్కన సిఆర్‌సి చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ చలివేంద్రానికి బుధవారం కె.ఎస్.ఆర్ & కంపెనీ ప్రొ॥ కర్రి చండికేశవరెడ్డి సిఆర్‌సి చలివేంద్రానికి 5 వేలు విరాళం అందజేసారు. బుధవారం వీరి సౌజన్యంతో మజ్జిగను అందజేసారు. ఈ కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షులు కర్రి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నారాయణమూర్తిని పరామర్శించిన ఎమ్మెల్యే చిర్ల



రావులపాలెం : విశాఖపట్నం అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాసంశెట్టి నారాయణమూర్తిని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భముగా నారాయణమూర్తి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. తన నియోజక వర్గంలో రావులపాలెం మండలం, దేవరపల్లికి చెందిన నారాయణమూర్తిఅని గుండెపోటుతో బాధపడుతున్నారని ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కి గుడ్‌బై చెప్పిన డివిలియర్స్



కేప్‌టౌన్: సౌతాఫ్రికా దిగ్గజ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ క్రికెట్ అభిమానులకు షాకింగ్ న్యూస్ చెప్పాడు. తన అద్భుతమైన ఆటతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఈ మిస్టర్ 360 అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలుగుతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. సోషల్‌మీడియా వేదికగా తన రిటైర్‌మెంట్‌కు సంబంధించిన ఓ వీడియోను డివిలియర్స్ షేర్ చేశాడు. ఈ వీడియోలో ఇది చాలా కఠిన నిర్ణయం కానీ చాలా కాలంగా ఈ విషయంపై ఆలోచిస్తున్నాను.. కానీ నేను తప్పుకోవడానికి ఇదే సరైన సమయం. క్రికెట్ సౌతాఫ్రికాకి, నా జట్టు సభ్యులకు, సౌతాఫ్రికా, ప్రపంచవ్యాప్తంగా నా వెనుక ఉండి నాకు మద్దతు తెలిపిన అభిమానులకు నా ధన్యవాదాలు అని డివిలియర్స్ తెలిపాడు. 2004 డిసెంబర్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌తో డివిలియర్స్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఆరంగేట్రం చేశాడు. ఈ 14 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో 114 టెస్టులు, 228 వన్డేలు, 78 టీ20లు, 141 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన ఏబీడి మొత్తం 50 శతకాలు, 137 అర్థశతాకాలు, 2 ద్విశతకాలు సాధించాడు. ముఖ్యంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తరపున ఆడే డివిలియర్స్ తన బ్యాటింగ్ స్టైల్‌తో భారత్‌లో అత్యంత ప్రేమించే విదేశీ ఆటగాడిగా పేరు సంపాదించుకున్నాడు. అయితే తాను అంతర్జాతీయ క్రికెట్‌కి మాత్రమే గుడ్‌బై చెబుతున్నానని, డొమెస్టిక్ క్రికెట్‌కి మాత్రం అందుబాటులో ఉంటానని డివిలియర్స్ వీడియోలో పేర్కొన్నాడు.

కాగా 2019 ప్రపంచకప్‌కి ముందు డివిలియర్స్ రిటైర్‌మెంట్ ప్రకటించడం సౌతాఫ్రికా జట్టు భారీ ఎదురుదెబ్బ తగిలినట్టేనని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. తమ అభిమాన క్రికెటర్ ఉన్నపళంగా రిటైర్‌మెంట్ ప్రకటించడంతో అభిమానులు తీవ్ర నిరాశకి గురయ్యారు.

# కమల్ హాసన్‌పై కేసు నమోదు



చెన్నై : తమిళనాడు నిరసనలతో అట్టుడుకుతోంది. జరిగిన కాల్పుల్లో 11 మంది మరణించారు. క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని పరామర్శించేందుకు ఆసుపత్రికి వెళ్ళిన ప్రముఖ నటుడు కమల్ హాసన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. 144 సెక్షన్ అమలవుతున్న ప్రదేశానికి ఆయన వెళ్ళినందుకు ఈ కేసు నమోదు చేశారు. తూత్తికుడిలో హింస చెలరేగిన ప్రాంతాన్ని పోలీసులు చుట్టుముట్టారు. ఈ ప్రాంతమంతటినీ తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు.

కమల్ హాసన్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలకు విలువ లేకుండాపోయిందన్నారు. కాల్పులకు బాధ్యులెవరో తెలుసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజలు సమాధానాలు కోరుతున్నారన్నారు.

వేదాంత గ్రూప్ ఆధ్వర్యంలోని స్టెరిలైట్ కంపెనీని మూసివేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌ను ముట్టడించిన నిరసనకారులపై మంగళవారం కాల్పులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ కాల్పుల్లో 11 మంది మరణించారు.

ఇదిలావుండగా తూత్తుకుడిలో బుధవారం కూడా కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో మరొకరు మరణించినట్లు సమాచారం. కొందరు నిరసనకారులు రెండు బస్సులకు నిప్పు పెట్టారు.

# గర్భిణి విద్యార్థినికి సుప్రీంకోర్టు షాక్



న్యూఢిల్లీ : ఢిల్లీ విశ్వవిద్యాలయంలో రెండో సంవత్సరం ఎల్‌ఎల్‌బీ చదువుతున్న విద్యార్థినికి సుప్రీంకోర్టు ఊరటనివ్వలేదు. ఆమె గర్భిణి కావడంతో తరగతులకు హాజరు కాలేకపోయారు. హాజరు అవసరమైనదాని కన్నా తక్కువగా ఉండటంతో ఆమెను ప్రస్తుతం జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలకు విశ్వవిద్యాలయం అధికారులు హాజరుకానివ్వలేదు. 70 శాతం హాజరు తప్పనిసరి అనే నిబంధన నుంచి తనకు మినహాయింపునివ్వాలని ఆమె కోరారు. కానీ సుప్రీంకోర్టు అందుకు తిరస్కరించింది.

మొదట ఆమె ఢిల్లీ హైకోర్టు సింగిల్ జడ్జి ధర్మాసనాన్ని ఆశ్రయించారు. కళాశాలకు హాజరు నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆమె చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. దీనిపై ఆమె హైకోర్టు డివిజన్ బెంచ్‌కు అపీలు చేశారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలు చట్టవిరుద్ధమని ఆరోపించారు. పరీక్ష రాసేందుకు తనకు ఉన్న హక్కును తాను గర్భిణిని కావడం వల్ల నిరాకరించారని పేర్కొన్నారు. డివిజన్ బెంచ్ కూడా ఆమెకు ఊరటనివ్వలేదు. దీంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఆమె పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏ ఎం ఖన్విల్కర్, జస్టిస్ నవీన్ సిన్హా ధర్మాసనం బుధవారం విచారించింది. ఆమె తరపు న్యాయవాదులు అశిష్ వీరమణి, హిమాంశు ధూపర్ మాట్లాడుతూ తమ క్లయింటు గర్భిణికావడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారని, అందువల్ల కళాశాలకు హాజరు కాలేకపోయారని వాదించారు.

విశ్వవిద్యాలయం తరపున న్యాయవాదులు మాట్లాడుతూ ఎల్‌ఎల్‌బీ డిగ్రీ అనేది వృత్తి విద్యా కోర్సు అని తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించిన ఉపన్యాసాలను క్రమం తప్పకుండా తరగతులకు హాజరై వినవలసి ఉంటుందని తెలిపారు. ఈ ఉపన్యాసాల్లో నిర్ణీత శాతం ఉపన్యాసాలకు హాజరు కానటువంటి విద్యార్థులు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో నమోదు చేయించుకునేందుకు అర్హులుకారని వివరించారు.

ఆమె గర్భిణి కావడం వల్ల, బిడ్డ పుట్టడం వల్ల రెండు నెలల పాటు ఫోర్త్ సెమిస్టర్ తరగతులకు హాజరుకాలేకపోయారు.

70 శాతం హాజరు తప్పనిసరి అనే నిబంధన అమలవుతుండటంతో ఆమెను పరీక్ష రాసేందుకు అనుమతించలేదు.

# స్టెరిలైట్ విస్తరణను ఆపండి

## మద్రాస్ హైకోర్టు స్టే

## 4 నెలల్లోపు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలి



చెన్నై: తమిళనాడులోని తూత్తుకుడిలో స్టెరిలైట్ విస్తరణ పనులను నిలిపివేయాలని మద్రాస్ హైకోర్టు బుధవారం స్టే జారీ చేసింది. ఈ మేరకు వేదాంత గ్రూప్‌నకు ఆదేశాలు జారీ చేసింది. మరోపక్క తూత్తుకుడిలో ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగిన తర్వాతే స్టెరిలైట్ విస్తరణకు సంబంధించిన పర్యావరణ అనుమతులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. నాలుగు నెలల్లోపు ఈ ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించాలని తన ఆదేశాల్లో పేర్కొంది.

ఇప్పటివరకు ఏటా 4,00,000 టన్నుల రాగిని ఉత్పత్తి చేసే కర్మాగారాన్ని ఇక్కడ స్టెరిలైట్ నిర్వహిస్తోంది. దాదాపు మరో రూ.3,000 కోట్లు వెచ్చించి ఇక్కడే మరో రాగి ప్లాంట్ నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే కాలుష్యం కారణంగా ఇబ్బందులు పడుతున్న స్థానికులు పరిశ్రమ విస్తరణను వ్యతిరేకిస్తూ మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో దాదాపు 11 మృతి చెందారు.

**ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత..**

పోలీస్ కాల్పుల్లో మృతి చెందిన వారి దేహాలను భద్రపర్చిన ఆసుపత్రి వద్ద బుధవారం ఉద్రిక్తత నెలకొంది. వారి మృత దేహాలను తీసుకునేందుకు బంధువులు నిరాకరించి ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు బాధితులను పరామర్శించేందుకు ఆసుపత్రి వద్దకు చేరుకుంటున్నారు. ఇప్పటికే సినీనటుడు, ఎంఎన్‌ఎం పార్టీ అధినేత కమల్‌హాసన్ క్షతగాత్రులను పరామర్శించారు. అయితే ఈ సందర్భంగా కమల్‌కు అక్కడ చేదు అనుభవం ఎదురైంది. మీరు రావటం వల్ల మేము ఇబ్బందులు పడుతున్నాం.. దయ చేసి ఇక్కడి నుంచి వెళ్లిపొండి అంటూ బాధితులు ఆయన్ను కోరారు. ప్రధాన ప్రతిపక్షమైన డీఎంకే ఈ నెల 25 తేదీన అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనకు పిలుపునిచ్చింది.

తూత్తుకుడిలో పోలీస్ కాల్పుల ఘటన కోల్డ్ బ్లడెడ్ మర్డర్ అని పీఎంకే చీఫ్ అన్బుమణి రామదాస్ ఆరోపించారు.

అక్కడి ఎస్పీ, కలెక్టర్, డీజీపీ, ప్రధాన కార్యదర్శులను సస్పెండ్ చేసి వారిపై హత్యానేరం కింద విచారణ జరపాలన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి పళనిస్వామి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

హింసాత్మక ఘటనతో 40 మంది పోలీస్ అధికారులపై బదిలీ వేటు

తూత్తుకుడిలో పోలీస్ కాల్పులను ఖండిస్తూ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు ఇచ్చిన బంద్ కొనసాగుతోంది. వాణిజ్య సంస్థలు స్వచ్ఛంధంగా బంద్ పాటిస్తున్నాయి. మరోవైపు ఐదుగురు ఐపీఎస్ అధికారుల నేతృత్వంలో భారీగా బలగాలు మోహరించాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 2వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు. తూత్తుకుడిలో హింసాత్మక ఘటనతో 40 మంది పోలీస్ అధికారులపై డీజీపీ బదిలీవేటు వేశారు. బంద్ కారణంగా ఇవాళ జరగనున్న అన్నీ పరీక్షలు రద్దు చేశారు. పోలీస్ కాల్పులకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా పలు పార్టీల కార్యకర్తలు సీఎం, ప్రధాని దిష్టిబొమ్మలను దహనం చేశారు. రాగి ఫ్యాక్టరీ బాధితుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని డీఎంకే నేత స్టాలిన్ నిప్పులు చెరిగారు. తూత్తుకుడి ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా కుమారస్వామి ప్రమాణస్వీకారోత్సవానికి వెళ్లాల్సిన స్టాలిన్ తన బెంగళూరు పర్యటన రద్దు చేసుకుని తూత్తుకుడి వెళ్లారు. కమల్ హాసన్ కూడా తూత్తుకుడిలో పర్యటించారు. మరోవైపు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రజాసంఘాల సభ్యులను ఎండీఎంకే అధినేత వైగో పరామర్శించారు.

క్షతగాత్రులకు అన్నా నగర్‌లోని జనరల్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈ ఆసుపత్రి వద్ద బుధవారం తాజాగా హింసాత్మక సంఘటనలు జరిగాయి. స్థానికులు, పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది.

# సామూహిక హత్యాకాండ

# 23మంది చిన్నారుల ఊచకోత..!

## - మొత్తం 99 మంది బలి - రోహింగ్యా ఉగ్రవాదుల ఘోరకలి

## - ప్రముఖ మానవ హక్కుల సంస్థ అమ్నెస్టీ ప్రకటన

మయన్మార్: మయన్మార్‌లో రోహింగ్యా ఉగ్రవాదులు అరాచకం సృష్టించారని ప్రముఖ మానవ హక్కుల సంస్థ అమ్నెస్టి ఇంటర్నెషనల్ పేర్కొంది. గత ఏడాది ఈ ఉగ్రవాదులు ఓ హిందూ ఉత్తర రఖైన్ రాష్ట్రంలో మారుమూల గ్రామాలపై దాడి చేసి సుమారు 99 మందిని ఒకేసారి నరికి చంపారని తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను బుధవారం విడుదల చేసింది. గత ఏడాది ఆగస్టు 25న ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తన నివేదికలో వెల్లడించింది. అదే రోజు రోహింగ్యా ఉగ్రవాదులు పలు పోలీస్ పోస్టులపై కూడా దాడులు చేశారు. అర్కాన్ రోహింగ్యా సాల్వేషన్ ఆర్మీ (అర్సా) ఈ ఘాతుకానికి పాల్పడినట్లు భావిస్తున్నారు.

**అందరిని బయటకు తీసుకొచ్చి..**

ఆహ్ నౌక్‌ఖా మంగ్ సైకి గ్రామాన్ని చుట్టుముట్టిన రోహింగ్యా ఉగ్రవాదులు స్థానికులను బయటకు తీసుకొచ్చారు. వీరిలో చిన్నారులు, మహిళలు, పురుషులు ఉన్నారు. కత్తులు, రాడ్లు చేతబట్టుకున్న ఆ ఉగ్రవాదులు గ్రామస్థులను దారుణంగా ఊచకోత కోశారని స్థానిక మహిళ ఒకరు అమ్నెస్టికి తెలిపారు. ఈ ఘటనలో మొత్తం 20 మంది పురుషులు, 10 మంది మహిళలు, 23 మంది పిల్లలు చనిపోయారు. వీరిలో 14 మంది వయస్సు 8ఏళ్లకంటే తక్కువే. వీరి మృతదేహాలను గ్రామానికి సమీపంలోని ఒక ఖాళీ ప్రదేశంలో సామూహికంగా ఖననం చేశారు. వీటిని సెప్టెంబర్‌లో కనుగొన్నారు. మిగిలిన వారి మృతదేహాల ఆచూకీ తెలియలేదు. దీంతోపాటు ఈ గ్రామానికి సమీపంలోని యె బౌక్ క్యార్ అనే గ్రామంలో 46మంది కూడా అదృశ్యమైపోయారు. దీంతో ఈ ఉగ్రదాడిలో రెండు గ్రామాల్లో కలిపి 99 మందిని ఉగ్రవాదులు దారుణంగా హత్యచేసినట్లు భావిస్తున్నారు. గత సెప్టెంబర్‌లో మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింలపై దాడులు అంతర్జాతీయ సమాజం నిరసనలకు కారణమయ్యాయి. ఈ సమయంలోనే సామూహిక ఖననం జరిగిన ఓ ప్రదేశాన్ని ప్రభుత్వ బలగాలు కనుగొన్నాయి. ఈ ఘటనలో మృతులు రోహింగ్యాలై ఉంటారని తొలుత భావించారు. కానీ పరిశోధన తర్వాత మృతులంతా హిందువులని తేలింది.

# 26న పెట్రోల్ ధరలకు నిరసనగా కాంగ్రెస్ దీక్ష

అనకాపల్లి : ఈనెల 26 న కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ ధరలకు నిరసనగా పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నట్లు యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కోరిబిల్లి పరి ప్రకటించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ఒకే నెలలో మూడు సార్లు పెట్రోల్ ధరలు పెంచి సామాన్య మానవుడు నడ్డి విరిచారని దీని వలన అన్ని నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని, వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్‌లో శనివారం ఒక్కరోజు దీక్ష చేపట్టనున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# తుమ్మపాల ఆనకట్ట ఆలోచన విరమించుకోవాలి

## మాజీ మంత్రి దాడి డిమాండ్



అనకాపల్లి: తుమ్మపాల గ్రోయిన వద్ద ఆనకట్ట నిర్మించాలని, తీసుకున్న నిర్ణయం వెంటనే విరమించుకోవాలని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు డిమాండ్ చేసారు. పట్టణంలో జివి రమణ రైతు భారతిలో బుధవారం రైతు సంఘాలు, ప్రజా సంఘాలు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడారు. శారదానదిపై ఉన్న గ్రోయిన్లకు బదులు ఆనకట్ట నిర్మించాలని స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు నిర్ణయించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో కూడా ఇటువంటి ప్రతిపాదనలు వస్తే రైతులు ప్రతిగటించడం జరిగిందన్నారు. అయినా ఇప్పటి పాలకులు ఆనకట్టనిర్మించి గ్రోయిన్లను నిర్వీర్యం చేయాలని చూడడం సమంజసం కాదన్నారు. గ్రోయిన్లు పటిష్ట పరిచేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. అధికారులు, ప్రజా ప్రతినిధులను ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించారని విమర్శించారు. వారు తయారు చేసిన నివేదిక వల్లే ఈ పొరపాట్లు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకూడా ఇటువంటి నిర్ణయానికి ఆమోదం తెలపాలన్నారు. తుమ్మపాల గ్రోయిన్‌వద్ద ఆనకట్ట నిర్మిస్తే నీరు దిగువ ప్రాంతాలకు రాదన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని, ఆవేదన వ్యక్తం చేసారు. దీనిపై అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాల్సి ఉంటుందని హెచ్చరించారు. అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, రైతు సంఘాలతో కార్యచరణకు కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుంధన్నారు. త్వరలోనే ఆనకట్ట నిర్మాణానికి వ్యతిరేకంగా అందరితో కలిసి పాదయాత్ర చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులను, ప్రజా ప్రతినిధులను కలిసి ఆనకట్ట ఆలోచన విరమించుకోవాలని కోరడం జరుగుతుందన్నారు. అలాగే, ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు, సిపిఐ నాయకులు మాదవరావు, వైఎన్ భద్రం, మాజీ మున్సిపల్ చైర్మన్ విల్లూరి పైడారావు, విల్లూరి రాము, తదితరులు ప్రసంగించారు. రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ వివిధ సలహాలను కమిటీకి తెలియజేసారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా మళ్ళ జన్మదిన వేడుకలు







# ధర్మ పోరాట సభ శుద్ధి విఫలం

## వైకాపా నేతల అరెస్ట్





విశాఖపట్నం : విశాఖ కేంద్రంగా తెలుగుదేశం పార్టీ మంగళవారం నిర్వహించిన ధర్మ పోరాట వేదికను, గంగా జాలంతో శుద్ధి చేసేందుకు వైకాపా ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వి. విజయసాయి రెడ్డి నేతృత్వాంలో ప్రతిపక్ష పార్టీ చేసిన ప్రయత్నాన్ని పోలీసు బలగాలు భగ్నం చేశాయి. బుధవారం ఉదయం విశాఖలోని మద్దిలపాలెంలో గల వైకాపా నగర కార్యాలయం నుంచి మద్దిలపాలెం కూడలి వద్ద గల ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి ర్యాలీగా బయలుదేరడం.. పోలీసు వర్గాలు అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం తలెత్తింది. అయితే పార్టీ కార్యాలయం బయటనే పోలీసులు వారిని నిర్భంధంచారు. దీంతో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నగర అధ్యక్షుడు మళ్ళ విజయ్‌ప్రసాద్‌లు మద్ధిపాలెం ఆటోమేటివ్ జంక్షన్‌లోని జాతీయ రహదారిపైనే బైఠాయించారు. శాంతియుతంగా కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని చేస్తున్న తమను నిర్భందించడం సరికాదని పోలీసుతో వాదించారు. అక్కడ నుంచి లేచి అటువైపుగా మరలా బైఠాయించారు. దీంతో సుమారు 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో విజయసాయిరెడ్డి, మళ్ల విజయ్‌ప్రసాద్ లను, పోలీసులు అదుపులోకి తీసుకొనని పోలీసు బేరక్స్‌కు తరలించారు.









# ఘనంగా మళ్ళ జన్మదిన వేడుకలు

విశాఖపట్నంః వైకాపా నగర మాజీ అధ్యక్షుడు మళ్ళ విజయ ప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నగరంలో జరిగాయి. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. వైకాపా రాష్ట్ర యూత్ సెక్రటరీ శివగణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మళ్ళ విజయ ప్రసాద్ కట్ చేసి జన్మదిన వేడకలు ప్రారంభించారు. మళ్ళ విజయప్రసాద్ మరిన్ని వేడుకలు జరుపుకోవాలని ఈ సందర్భంగా అందరూ ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో యలమంచిలి వైకాపా సమన్వయకర్త యు.వి. రమణ మూర్తి రాజు (కన్నబాబు), అనకాపల్లి పార్ల మెంటు ఇన్‌ఛార్జి గుడివాడ అమర్‌నాధ్, సత్తి రామకృష్ణ రెడ్డి, గొల్ల బాబూ రావు, కుంబా రవిబాబు, శివ కిషోర్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.





వెల్ఫేర్ గ్రూప్స్ అధినేత, మాజీ ఎమ్మెల్యే, వైకాపా నగర అధ్యక్షుడు డాక్టర్ విజయప్రసాద్ మళ్ళ జన్మ దిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు మళ్ళకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగా ఆల్‌వెల్ గ్రూప్ అధినేత, హెూటల్ ఆర్.ఆర్. గ్రాండ్ మేనేజింగ్ డైరెక్టర్, గ్రేటర్ విశాఖ వైకాపా అధ్యక్షుడు బొడ్డేటి నాగేశ్వర రావు (నాగు) అనూరాధ దంపతులు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలమరశెట్టి గోపి, గణేష్, కాండ్రేగుల శివ అప్పారావు, గెలాక్సీ శ్రీను, పోలిశెట్టి అప్పారావు, ప్రసాద్, వెంకటేష్, వార్డు మహిళా ప్రెసిడెంట్ పద్మ తదితరులు ఉన్నారు.

# ధర్మ పోరాట సభ శుద్ధి చేస్తామంటే చూస్తూ ఊరుకోం

## వైకాపాను హెచ్చరించిన మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం : ధర్మపోరాటం సభ విజయవంతం అవడం తట్టుకోలేని వైకాపా నాయకులు ఆ ప్రాంతాన్ని శుద్ధి చేస్తాననడం మంత్రి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో మంగళవారం జరిగిన ధర్మపోరాటం సభ విజయవంతం పట్ల మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. గత ధర్మపోరాట సభ విజయవంతం చేసేందుకు గత రెండు రోజులుగా కృషి చేసిన ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘ అనుభవం కలిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఎటువంటి సాయం చేయకపోవడంతో బీజేపీని వదులుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ఆవేశంగా ప్రసంగం చేయడం సభలో ప్రతీఒక్కరి మనస్సును హత్తుకునే విధంగా ఉందన్నారు. 68 ఏళ్ల వయసులో కూడా రాష్ట్రం అభివృద్ధి కోసం అహర్నిశలు ప్రయత్నిస్తున్నారని గంటా తెలిపారు. ధర్మ పోరాట సభలో మంత్రులు ఎంతో హుందాగా మాట్లాడారని ఆయన అన్నారు.

మంచి ఉద్దేశంతో ఒక క్రతువులా చేసిన ధర్మపోరాటం సభ ప్రాంతాన్ని శుద్ధి చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని మంత్రి గంటా శ్రీనివాసరావు ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇలాంటి నీచ రాజకీయాలు మానుకోవాలని వైకాపా నాయకులకు మంత్రి గంటా శ్రీనివాసరావు హితవుపలికారు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా విశాఖకు ప్రత్యేక రైల్వే జోన్ సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంపై తెలుగుదేశం ప్రభుత్వం ఒత్తిడి తెస్తూ ఉంటే వైయస్సార్సీపి రాష్ట్ర హక్కుల కోసం తెలుగుదేశంతో కలసివచ్చే కేంద్రాన్ని నిలదీస్తే హోదా వచ్చితీరుతుందని మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు

అలాకాకుండా తెలుగుదేశం చేస్తున్న మంచి పనులపై హేళన చేయడం తెలుగుదేశం నిర్వహించిన సభ ప్రాంతాలను శుద్ధి చేయటం వంటి నీచ రాజకీయాలు మానుకోవాలని శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు.

# వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు

### పోలీసు నిఘా ముమ్మరం చేయాలి

### డీజీపీకి సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశం

అమరావతి: అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ముమ్మరం చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. వదంతులు వ్యాప్తి చేసే వారిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలపై సమీక్ష నిర్వహించాలని డీజీపీని చంద్రబాబు ఆదేశించారు. వదంతులు వ్యాపింపచేసి ప్రజల్లో భయం పెంచేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు.

రాబోయే ఖరీఫ్ సీజన్‌లో నారుమళ్లకు వీలుగా నీటి విడుదలపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటిమట్టాలపై బుధవారం ఆయన సమీక్షించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా నీటిమట్టాలపై పరిశీలన చేశారు. ప్రధాన జలాశయాల్లో 207.31 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు సీఎంకు తెలిపారు. మీడియం జలాశయాల్లో 107టీఎంసీలకు గాను 27.9టీఎంసీల నీటిని నిల్వ చేశారని వెల్లడించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ.. జలాశయాల్లో నీటినిల్వ, ఎగువనుంచి వరద ప్రవాహం ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జల సంరక్షణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.














Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com